




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 54 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : చిత్తూరు | ఆదివారం 8 మార్చి 2026 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 54 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : CHITTOOR | SUN 8 MARCH 2026 | PRICE : 5/- RS

Simultaneously Published form Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur


## కొత్తగా ఆలోచించే వారి కోసం

# 'క్రియేటివ్ సిటీ'

### సీఎం చంద్రబాబు ప్రకటన



- ఢిల్లీలో రైసినా డైలాగ్-2026 సదస్సు
- ఈ సదస్సుకు హాజరైన తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఘనత
- త్వరలో అమరావతి వేదికగా గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ ఏర్పాటు
- సాంకేతికతతో భారత్‌కు రివర్స్ మైగ్రేషన్ తప్పదని సీఎం వెల్లడి
- దక్షిణాదిలో తగ్గుతున్న జననాల రేటును పెంచేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు

పెన్ పవర్ డెస్క్:"విభిన్నంగా ఆలోచించే వారి కోసం, సృజనాత్మకతకు పెద్దపీట వేసే మేధావుల కోసం అమరావతిలో అత్యాధునికమైన 'క్రియేటివ్ సిటీ'ని నిర్మిస్తున్నాం. కేవలం పరిపాలనా నగరంగా మాత్రమే కాకుండా, భవిష్యత్ తరాలకు వేదికగా అమరావతిని తీర్చిదిద్దుతున్నాం" అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. న్యూఢిల్లీ వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక 'రైసినా డైలాగ్-2026' సదస్సులో పాల్గొన్న ఆయన, తన ప్రసంగంలో అమరావతి అభివృద్ధికి సంబంధించి కీలక విషయాలను ప్రపంచ దేశాల ప్రతినిధులతో పంచుకున్నారు. అమరావతిలో కేవలం భవనాలు మాత్రమే ఉండవని, అక్కడ డ్రోన్ సిటీ, ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్స్ సిటీ వంటి భవిష్యత్ ఆధారిత రంగాలు కొలువుదీరుతాయని

మిగతా 2లో



## జగన్ ను ఎదుర్కోలేక చంద్రబాబు కుట్రపూరిత ఆరోపణలు చేస్తున్నారు

- తిరుమల లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు పచ్చి అబద్ధాలు చెప్పారన్న సజ్జల
- తమ హయాంలో తిరుమలలో క్వాలిటీ టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామని వెల్లడి
- బీఆర్ నాయుడు విషయంలో చంద్రబాబు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్న

పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత జగన్ ను రాజకీయంగా ఎదుర్కోలేకే ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల లడ్డూ ప్రసాదంపై కుట్రపూరిత ఆరోపణలు చేస్తున్నారని సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.లడ్డూ ప్రసాదంలో జంతువుల

మిగతా 2లో



## జగన్ మద్య నిషేధం హామీ వెనుక కథ వేరే ఉంది

- ప్రజలను వంచించడానికే ఆ హామీ అన్న లోకేశ్
- ప్రతి నెల రూ. 100 కోట్ల ముడుపులు అందాయని ట్వీట్
- రూ. 3,500 కోట్ల లాండరింగ్ జరిగిందన్న లోకేశ్

పెన్ పవర్ డెస్క్:గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా విరుచుకుపడ్డారు. 2019 ఎన్నికల సమయంలో జగన్ ఇచ్చిన 'మద్య నిషేధం' హామీ వెనుక అసలు కథ వేరే ఉందని, ఆ హామీ కేవలం ప్రజలను వంచించడానికేనని లోకేశ్ ఆరోపించారు. ఒక ప్రముఖ ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనాన్ని ఆధారంగా చేసుకుని, గత ఐదేళ్లలో జరిగిన అవినీతి చిట్టాను ఆయన బయటపెట్టారు. ఈ మేరకు జాతీయ మీడియాలో వచ్చిన కథనాల క్లిప్పింగ్ లను కూడా లోకేశ్ తన ట్వీట్ లో పంచుకున్నారు.మద్యం వ్యాపారం ద్వారా ప్రతి నెలా సుమారు వంద కోట్ల రూపాయల మేర ముడుపులు అందాయని, మొత్తంగా 3,500 కోట్ల రూపాయల మేర మనీ లాండరింగ్ జరిగిందని

మిగతా 2లో

## హార్ముజ్ జలసంధిలో ఆయిల్ ట్యాంకర్‌పై

# ఇరాన్ దాడి...

### మరింత ముదిరిన ఉద్రిక్తతలు



- హార్ముజ్ జలసంధిలో 'ప్రైమా' అనే ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ దాడి
- హెచ్చరికలు పట్టించుకోకపోవడంతో డ్రోన్‌తో విరుచుకుపడ్డ ఆర్మీ
- శత్రు దేశాల నౌకలకు జలసంధిలో అనుమతి లేదన్న ఇరాన్
- గత ఎనిమిది రోజులుగా జలసంధి తమ ఆధీనంలోనే ఉందన్న ఐఆర్‌జీసీ
- జలసంధిని పూర్తిగా మూసివేయలేదని ఇరాన్ ప్రభుత్వం స్పష్టీకరణ

పెన్ పవర్ డెస్క్:పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ హార్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. శనివారం హార్ముజ్ జలసంధి గుండా వెళుతున్న 'ప్రైమా' అనే ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషన్ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) దాడి చేసింది. తమ హెచ్చరికలను బేఖాతరు చేసినందుకే ఈ నౌకపై దాడి చేశామని ఇరాన్ సైన్యం ప్రకటించింది.

మిగతా 2లో



## ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీదుర్గపై నాన్ బెయిలబుల్ వారెంట్

- డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో లక్ష్మీదుర్గను ఏ-2గా చేర్చిన సిట్ అధికారులు
- సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం ఎస్సీ ఎస్టీ కోర్టులో ఛార్జిషీట్
- కోర్టు ఆదేశాలతో లక్ష్మీ దుర్గ కోసం ముమ్మరంగా గాలిస్తున్న పోలీసులు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో శనివారం కీలక పరిణామం చోటుచేసు కుంది. ఈ కేసులో వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీ దుర్గకు రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది.

మిగతా 2లో





## చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం

- జయసుధకు ఏఎన్నార్ అవార్డు
- ఉత్తమ చిత్రం - రాజు వెడ్స్ రాంబాయి
- ఉత్తమ నటుడు - నాగ చైతన్య (తండేల్)
- ఉత్తమ నటి - రష్మిక (ది గర్ల్‌ఫ్రెండ్)
- ఉత్తమ దర్శకుడు - సాయిలు (రాజు వెడ్స్ రాంబాయి)

పెన్ పవర్ డెస్క్:2025లో విడుదలైన చిత్రాలకు సంబంధించి 'గద్దర్ ఫిలిం అవార్డ్స్-2025' విజేతలను తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. జ్యూరీ సభ్యులు విజేతల పేర్లను ప్రకటించారు. మెగాస్టార్ చిరంజీవిని ఎన్టీఆర్ జాతీయ పురస్కారంతో సత్కరించనున్నారు. 2025 జనవరి 1 నుంచి

మిగతా 2లో



## సుందర్ పిచాయ్ కి 63 వేల కోట్ల జీతం!

- గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌కు భారీ వేతనం.. ప్రపంచంలోనే అత్యధిక జీతం!
- గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌కు భారీ వేతన ప్యాకేజీ ప్రకటన
- రాబోయే మూడేళ్లలో రూ. 6,361 కోట్లు ఆర్జించే అవకాశం
- కంపెనీ పనితీరు ఆధారంగా రెట్టింపు కానున్న స్టాక్ యూనిట్లు
- వేమో, వింగ్ వంటి అటానమస్ వెంచర్ల వృద్ధికి ప్రోత్సాహకాలు

మిగతా 2లో




## చంద్రబాబు పాపులేషన్ పాలసీపై షర్మిల సెటైర్

- చంద్రబాబు జనాభా విధానంపై వైఎస్ షర్మిల వ్యంగ్యం
- ఉన్న పిల్లలకే దిక్కులేదు.. ఇప్పుడు ముగ్గురు ఎందుకని ప్రశ్న
- నిరుద్యోగులు ఆటోలు, ట్యాక్సీలు నడుపుకుంటున్నారని ఆవేదన
- రాష్ట్ర అప్పులు 12 లక్షల కోట్లకు చేరాయని మండిపాటు

పెన్ పవర్ డెస్క్:ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు జనాభా నియంత్రణ ఎత్తివేత, ఎక్కువ మంది పిల్లలను కనడంపై అసెంబ్లీలో చేసిన ప్రకటన పట్ల ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యంగ్యంగా స్పందించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న యువతకు సరైన ఉపాధి అవకాశాలు లేక ఇబ్బంది పడుతుంటే, ఇప్పుడు ముగ్గురు పిల్లలను కనమని చెప్పడం ఎంతవరకు


మిగతా 2లో

## భారత్‌లో పెరిగిన బిలియనీర్ల సంఖ్య...

- ప్రపంచంలో అత్యధిక బిలియనీర్లు ఉన్న మూడో దేశంగా భారత్
- గతేడాదితో పోలిస్తే కొత్తగా చేరిన మరో 24 మంది కుబేరులు
- ఏకంగా రూ.112.6 లక్షల కోట్లకు చేరిన మొత్తం సంపద
- హెల్త్‌కేర్ రంగం నుంచే అత్యధికంగా కొత్త బిలియనీర్లు
- ఆసియా బిలియనీర్ క్యాపిటల్ హోదాను కోల్పోయిన ముంబై

పెన్ పవర్ డెస్క్:భారత్‌లో సంపన్నుల సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. తాజాగా విడుదలైన 'హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్-2026' ప్రకారం.. ప్రపంచంలో అత్యధిక బిలియనీర్లు ఉన్న దేశాల జాబితాలో భారత్ మూడో స్థానంలో నిలిచింది. అమెరికా, చైనా తర్వాత భారత్ ఈ ఘనత సాధించింది. ప్రస్తుతం దేశంలో మొత్తం 308 మంది బిలియనీర్లు ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. దేశంలో సంపద సృష్టి, ఆర్థిక వృద్ధి బలంగా ఉందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి

మిగతా 2లో





## ఇక మీపై దాడులు చేయబోం, క్షమించండి

- ఎనిమిదో రోజుకు చేరుకున్న యుద్ధం
- ఇప్పటి వరకు చేసిన దాడికి 'సారీ' అన్న పెజెష్కియాన్
- గల్ఫ్ దేశాలపై ఇక దాడులు చేయబోమన్న అధ్యక్షుడు
- పొరుగు దేశాలు తమపై ప్రత్యక్ష దాడికి దిగితే మాత్రం ప్రతిదాడి చేస్తామని హెచ్చరిక

## ఎడిటర్ వ్యూ

# గల్ఫ్ బాధితులకు రక్షణ ఏదీ?

ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ దాడులతో పశ్చిమాసియా దేశాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. భీకర యుద్ధం జరుగుతున్న ఈ నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో సుమారు కోటి మంది భారతీయులు భిక్కుభిక్కుమంటూ దినమెక గండంగా గడుపుతున్నారు. గల్ఫ్ దేశాల్లో అత్యధికంగా యూఏఈ (దుబాయి)లో 43 లక్షలు, సౌదీ అరెబియాలో 27 లక్షలా 47 వేలు, ఖతార్, కువైట్..ఇలా ఆయా దేశాల్లో లక్షల సంఖ్యలో మన భారతీయులు ఉద్యోగ, ఉపాధి కోసం వలస వెళ్లినట్లు లెక్కలు చెబుతున్నాయి. నిత్యం మిసైళ్ల వర్షం కురుస్తున్న ఇజ్రాయిల్, ఇరాన్ దేశాల్లోనూ యాభై వేల మంది వరకు భారతీయులున్నట్లు అంచనా. ఈ రెండు దేశాల్లో మరింత భయానక వాతావరణం నెలకొన్నట్లు స్పష్టమౌతుంది. రానున్న రోజుల్లో మరింత భీకర యుద్ధం జరిగే అవకాశాలున్నట్లు ప్రస్తుత పరిస్థితులను బట్టి అర్థం చేసుకోవచ్చు. పొట్ట చేతపట్టుకుని గల్ఫ్ దేశాలకు వెళ్లిన భారతీయుల్లో ఎక్కువ మంది పేద, మధ్య తరగతి వారే ఉన్నారు. ఆయా ప్రాంతాల్లో రోజు వారి కూలీగా చేరిన వారే ఎక్కువగా ఉన్నారు. షిప్పింగ్, పోర్టు కంపెనీల్లో భారతీయులు పనిచేస్తున్నారు. వారి పరిస్థితి ముందు నుయ్యి-వెనుక గొయ్యిలా మారింది. ఇప్పటికే దాడుల్లో ముగ్గురు భారతీయులు మృతి చెందినట్లు వార్తలొచ్చాయి. యుద్ధ వాతావరణంలో బయట పనులు చేయలేని పరిస్థితులున్నాయి. ఈ పరిస్థితుల్లో వారి జీవన మనుగడ అత్యంత క్లిష్టంగా మారినట్లు తెలుస్తోంది. స్వస్థలాల్లో అప్పులు చేసి గల్ఫ్ దేశాలకు వెళ్లిన భారతీయులకు ప్రస్తుత యుద్ధవాతావరణంలో మన ప్రభుత్వాల నుండి భరోసా లభించడం లేదు. ఆయా దేశాల్లో చిక్కుకున్న తెలంగాణ వాసులు తమ కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో యూఏఈ పాలకులు ప్రవాసీయులకు కొంత భరోసా కల్పిస్తున్నారు. విమానాలు రద్దయినందున ఆయా హోటళ్లు, ఇతర ప్రాంతాల్లో ఉన్న వారిని బలవంతంగా ఖాళీ చేయించవద్దని ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే. ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తూ అక్కడి ప్రజలకు కొంత సహకారం అందిస్తున్నారు. కాగా..మన భారత ప్రధాని పలు దేశాధినేతలతో ఫోన్లో మాట్లాడినట్లు వార్తలు వచ్చాయి. ఢిల్లీలో హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. వీటితో చేతులు దులుపుకున్నట్లు తెలుస్తోంది. గల్ఫ్ దేశాల్లో ఉన్న భరతీయులకు రక్షణతో పాటు ఇక్కడి కుటుంబాలకు అండగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలేవీ కనిపించక పోవడం బాధాకరం. గల్ఫ్ దేశాల్లో భారతీయులు తీవ్ర భయాందోళనలో భిక్కు భిక్కుమంటూ గడుపుతున్న నేపథ్యంలో భారత ప్రధాని పుదుచ్చెరి, తమిళనాడు, కెనడా పర్యటనలు చేశారు. కేంద్ర మంత్రులు సైతం సొంత నియోజక వర్గాల పర్యటనలకే పరిమితమైనట్లు తెలుస్తోంది. దీంతో ఆయా దేశాల్లోని భారతీయుల బాగోగులు పట్టించుకునే వారే కరువయ్యారనే విమర్శలున్నాయి. దేశ వ్యాప్తంగా ఆయా పార్లమెంటు నియోజక వర్గాల వారీగా హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేసి..ఆయా కుటుంబ సభ్యులతో మాట్లాడి భరోసా ఇచ్చేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. దీంతో పాటు గల్ఫ్ దేశాల్లో ఉన్న భారతీయులకు రక్షణతో పాటు అహారం, ఇతర అవసరాలు తీర్చేలా కార్యచరణ చేపట్టాల్సి ఉంది. ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధ ప్రభావం భారత్‌పై ఏ మేరకు పడుతుందనే అందోళన నెలకొంది. ప్రధానంగా హోర్మూజ్ జలసంధి మూసివేతతో చమురు ట్యాంకర్ల నిలిపివేత ప్రభావం ధరల పెరుగుదలకు కారణమయ్యే అవకాశాలున్నట్లు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే బ్యారెల్ ధర 80 డాలర్లకు పెరిగిందని, క్రమ క్రమంగా మరింత పెరిగే అవకాశాలు లేక పోలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచబోమనే కేంద్ర ప్రభుత్వ ప్రకటన కోసం దేశ ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే పెట్రో ఉత్పత్తులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యాభై శాతం వ్యాట్‌ను వసూలు చేస్తున్నందున ప్రపంచ మార్కెట్‌లో క్రూడ్ అయిల్ ధర పెరిగినా నష్టాలు మాత్రం వచ్చే అకాశాలు లేవని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ బహిరంగ మార్కెట్‌లో పెట్రో ధరలను ప్రభుత్వం పెంచితే..అనివార్యంగా సరుకులు, వస్తువుల ధరలు భారీగా పెరిగే ప్రమాదం ఉంది. ఈ ప్రభావం దేశవ్యాప్త ఆందోళనలకు దారితీసే అవకాశాలున్నాయి.

## జగన్ ను ఎదుర్కోలేక చంద్రబాబు కుట్రపూరిత ఆరోపణలు చేస్తున్నారు

- మొదటి పేజి తరువాయి

కొవ్వు, కెమికల్స్ కలిపారంటూ చంద్రబాబు చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధాలని సజ్జల కొట్టిపారేశారు. వైసీపీ హయాంలోనే తిరుమలలో అత్యున్నత ప్రమాణాలు కలిగిన క్వాలిటీ టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. మార్కెట్‌లో హెరిటేజ్ నెయ్యి ధర కంటే ఇందాపూర్, అమూల్ నెయ్యి ధరలు తక్కువగా ఉన్నాయని... కేవలం కొన్ని సంస్థలకు లబ్ధి చేకూర్చడానికే నెయ్యి కాంట్రాక్టుల విషయంలో చంద్రబాబు రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. నెయ్యి కాంట్రాక్టుల వెనుక భారీ ఆర్థిక కుంభకోణం దాగి ఉందని, దీనిపై సీబీఐ విచారణ జరిపించాలని సజ్జల డిమాండ్ చేశారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసి స్వామివారి సొమ్మును దోచుకోవడమే ఈ విష ప్రచారం వెనుక ఉన్న అసలు ఉద్దేశమని విమర్శించారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి సంబంధించిన వీడియోల వివాదంపై సజ్జల స్పందిస్తూ... గతంలో తమ హయాంలో సినీ నటుడు పృథ్వీపై ఆరోపణలు రాగానే తక్షణమే రాజీనామా చేయించామని, కానీ ఇప్పుడు బీఆర్ నాయుడి విషయంలో చంద్రబాబు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. బీఆర్ నాయుడు తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. భక్తుల విశ్వాసాలపై చంద్రబాబుకు విశ్వాసం లేదనే విషయం మరోసారి అర్థమయిందని అన్నారు.

# సుందర్ పిచాయ్ కి 63 వేల కోట్ల జీతం!

టెక్ దిగ్గజం గూగుల్ సీఈఓ, భారత సంతతికి చెందిన సుందర్ పిచాయ్ ప్రపంచంలోనే అత్యధిక వేతనం అందుకుంటున్న ఎగ్జిక్యూటివ్‌లలో ఒకరిగా నిలిచారు. గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్, ఆయనకు రాబోయే మూడేళ్ల కాలానికి గాను ఏకంగా 692 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 6,361 కోట్లు) భారీ వేతన ప్యాకేజీని ప్రకటించింది. ఈ విషయాన్ని ఫైనాన్షియల్ టైమ్స్ తన కథనంలో వెల్లడించింది. ఈ ప్యాకేజీ ఆయన పనితీరు, కంపెనీ వృద్ధి లక్ష్యాలతో ముడిపడి ఉండటం విశేషం. ఈ భారీ ప్యాకేజీలో ఎక్కువ భాగం పెర్ఫార్మెన్స్ స్టాక్ యూనిట్ల రూపంలో ఉంది. దీని విలువ 126 మిలియన్ డాలర్లు. ఎస్‌డపీ 100 సూచీలోని ఇతర కంపెనీలతో పోలిస్తే ఆల్ఫాబెట్ షేర్ హోల్డర్లకు లభించే రాబడి ఆధారంగా ఈ ప్యాకేజీ విలువ మారుతుంది. కంపెనీ పనితీరు లక్ష్యాలను అధిగమిస్తే, ఈ విలువ రెట్టింపు అయి 252 మిలియన్ డాలర్లకు చేరవచ్చు. ఒకవేళ లక్ష్యాలను అందుకోకపోతే దీని విలువ సున్నా కూడా కావొచ్చు. దీనికి అదనంగా సుందర్ పిచాయ్‌కు మూడేళ్ల కాలానికి 84 మిలియన్ డాలర్ల విలువైన రిస్ట్రిక్టెడ్ స్టాక్, వార్షిక వేతనంగా 2 మిలియన్లు అందనున్నాయి.

కంపెనీలోని అటానమస్ (స్వయంప్రతిపత్త) వెంచర్లైన వేమో, వింగ్ ఏవియేషన్ వృద్ధికి ఊతమిచ్చేలా ఆల్ఫాబెట్ కొత్తగా 350 మిలియన్ డాలర్ల విలువైన స్టాక్ ప్రోత్సాహకాలను కూడా ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా పిచాయ్‌కు వేమోలో 130 మిలియన్ డాలర్ల విలువైన స్టాక్, వింగ్ ఏవియేషన్‌లో 45 మిలియన్ డాలర్ల షేర్లు లభిస్తాయి. ఈ వెంచర్ల పనితీరు అద్భుతంగా ఉంటే ఈ స్టాక్స్ విలువ 200 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. డ్రైవర్‌లెస్ కార్లు, డెలివరీ డ్రోన్స్ వంటి క్లిష్టమైన రంగాలలో సుందర్ పిచాయ్ నాయకత్వంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని ఆల్ఫాబెట్ బోర్డు ఈ సందర్భంగా పేర్కొంది. 2015 ఆగస్టులో సీఈఓగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సుందర్ పిచాయ్, గూగుల్ మార్కెట్ విలువను దాదాపు ఏడు రెట్లు పెంచారు. అప్పట్లో 535 బిలియన్ డాలర్లుగా ఉన్న మార్కెట్ క్యాప్, ఇప్పుడు 3.6 ట్రిలియన్ డాలర్లకు చేరింది. 53 ఏళ్ల పిచాయ్ 2004లో గూగుల్‌లో చేరి క్రోమ్, ఆండ్రాయిడ్ వంటి కీలక విభాగాలను విజయవంతంగా నడిపి ఉన్నత స్థాయికి చేరుకున్నారు. మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల (96.5 మిలియన్ డాలర్లు), యాపిల్ సీఈఓ టిమ్ కుక్ (74.3 మిలియన్ డాలర్లు) వంటి వారి వార్షిక వేతనాలతో పోలిస్తే పిచాయ్ ప్యాకేజీ చాలా అధికం కావడం గమనార్హం.

# ఇక మీపై దాడులు చేయబోం, క్షమించండి

అమెరికా, ఇజ్రాయెల్ దేశాలతో యుద్ధం కొనసాగుతున్న సమయంలో, గల్ఫ్ దేశాలకు ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ క్షమాపణలు చెప్పారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య భీకర యుద్ధం ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఇరాన్ గల్ఫ్ దేశాల్లోని అమెరికా ఆస్తులపై బాంబు దాడులు చేస్తోంది. తమ దేశంపై దాడులు చేస్తే ప్రతిదాడి చేస్తామని గల్ఫ్ దేశాలు కూడా ఇరాన్‌ను హెచ్చరించాయి. ఇలాంటి తరుణంలో ఈ కీలక పరిణామం చోటు చేసుకుంది.ఇరాన్ ప్రజలను ఉద్దేశించి అధ్యక్షుడు ఒక టీవీ ఛానల్‌లో మాట్లాడారు. గల్ఫ్ దేశాలపై ఇక ఎలాంటి దాడులు జరగబోవని పెజెష్కియాన్ కీలక ప్రకటన చేశారు. అయితే పొరుగు దేశాలు తమపై ప్రత్యక్ష దాడికి దిగితే మాత్రం స్పందించే హక్కు ఉందని స్పష్టం చేశారు. "ఇరాన్ దాడికి గురైన పొరుగు దేశాలకు నా తరఫున, ఇరాన్ ప్రజల తరఫున క్షమాపణలు చెబుతున్నాను. గల్ఫ్ దేశాలపై ఇక దాడులు జరగవు. ఇరాన్‌పై ఆ దేశాలు దాడి చేయకపోతే తాము కూడా ఎలాంటి క్షిపణులు ప్రయోగించకూడదని తాత్కాలిక నాయకత్వ మండలి నిర్ణయించింది" అని ఇరాన్ స్టేట్ టీవీలో ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో పెజెష్కియాన్ ఈ వ్యాఖ్యలు చేశారు.

పొరుగు దేశాలపై దాడులు చేయడం తమ ఉద్దేశం కానేకాదని అన్నారు. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత తీవ్రం కాకూడదనే ఉద్దేశంతో గల్ఫ్ దేశాలపై దాడులు చేయకూడదని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.ఇరాన్ లొంగిపోవాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై కూడా పెజెష్కియాన్ స్పందించారు. టెహ్రాన్ లొంగిపోయే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఇరాన్ లేదా ఇరాన్ ప్రజలు లొంగిపోవాలనే వారి కలలను వారు సమాధి చేసుకోవాలని వ్యాఖ్యానించారు.

# చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం

- మొదటి పేజి తరువాయి

డిసెంబర్ 31 వరకు సెన్సార్ పూర్తి చేసుకున్న చిత్రాలు, షార్ట్ ఫిలింలను పరిగణనలోకి తీసుకుని విజేతలను ఎంపిక చేశారు. ఈ అవార్డుల ప్రదానోత్సవం మార్చి 19న ఉగాది పర్వదినం సందర్భంగా అత్యంత వైభవంగా జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పురస్కారాలను అందజేయనున్నారు.

**స్పెషల్ అవార్డులు:**
ఎన్టీఆర్ జాతీయ అవార్డు - చిరంజీవి
ఏఎన్నార్ అవార్డు - జయసుధ
పైడి జయరాజ్ అవార్డు - కమల్ హాసన్
నాగిరెడ్డి చక్రపాణి అవార్డు - అశ్వనిదత్

**ఫీచర్ ఫిల్మ్స్:**
ఉత్తమ చిత్రం - రాజు వెడ్స్ రాంబాయి
ఉత్తమ ద్వితీయ చిత్రం - దండోరా
ఉత్తమ తృతీయ చిత్రం - ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్‌షో
ఉత్తమ నటుడు - నాగ చైతన్య (తండేల్)
ఉత్తమ నటి - రష్మిక (ది గర్ల్‌ఫ్రెండ్)
ఉత్తమ దర్శకుడు - సాయిలు (రాజు వెడ్స్ రాంబాయి)
ఉత్తమ బాలనటుడు - మాస్టర్ రోహన్ (ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో)
ఉత్తమ సహాయ నటుడు - శివాజీ
ఉత్తమ సహాయనటి - భూమిక (యూఫోరియా)
బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ ఆన్ నేషనల్ ఇంటిగ్రేషన్ - తండేల్
ఉత్తమ సోషల్ మెసేజ్ సినిమా - కోర్ట్
ఉత్తమ ప్రజాదరణ చిత్రం - సంక్రాంతికి వస్తున్నాం
ఉత్తమ డాక్యుమెంటరీ - యూనిటీ
బెస్ట్ ఫీచర్ ఫిల్మ్ పరిచయ దర్శకుడు - సాయి మార్తాండ్ (లిటిల్ హార్ట్స్)
ఉత్తమ బాలల చిత్రం - అనగనగా
ఉత్తమ సంగీత దర్శకుడు - మార్క్ రాబిన్ (దండోరా)
ఉత్తమ గాయకుడు - అనురాగ్ కులకర్ణి (రాజు వెడ్స్ రాంబాయి)
ఉత్తమ గాయని - సాహితీ (కన్నప్ప)
ఉత్తమ కథా రచయిత - గుణశేఖర్ (యుఫోరియా)
ఉత్తమ స్క్రీన్‌ప్లే - అనిల్ రావిపూడి (సంక్రాంతికి వస్తున్నాం)
ఉత్తమ లిరిసిస్ట్ - నందకిశోర్ (కుబేర)
ఉత్తమ సినిమాటోగ్రాఫర్ - కార్తిక్ ఘట్టమనేని (మిరాయ్)
ఉత్తమ ఎడిటర్ - శ్రీకర్ ప్రసాద్ (మిరాయ్).
ఉత్తమ సినీ గ్రంథం: ప్రభ (శూన్యం నుండి శిఖరాగ్రాలకు)
ఉత్తమ సినిమా విమర్శకుడు: హెచ్ రమేశ్ బాబు

## కొత్తగా ఆలోచించే వారి కోసం

# 'క్రియేటివ్ సిటీ'

- మొదటి పేజి తరువాయి

స్పష్టం చేశారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అమరావతిలో 'గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్'ను ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు.భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులో 'సాంకేతికత - సుపరిపాలన - భవిష్యత్తు' అనే అంశంపై చంద్రబాబు ప్రసంగించారు. 2016 నుంచి జరుగుతున్న ఈ సదస్సుకు ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని ఆహ్వానించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ అరుదైన గౌరవం దక్కించుకున్న చంద్రబాబు, ఏపీని 'ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం కంప్యూటింగ్ డెస్టినేషన్'గా మార్చే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఏఐ డేటా సెంటర్లతో పాటు, ఆరోగ్య రంగంలో డ్రోన్ అంబులెన్సులు వంటి విప్లవాత్మక మార్పులు ఏపీలో ఇప్పటికే రియాలిటీలోకి వచ్చాయని గుర్తుచేశారు. పెట్టుబడుల కోసం వచ్చే పారిశ్రామికవేత్తలకు ఎలాంటి జాప్యం లేకుండా అనుమతులు ఇస్తూ, ఏపీని వ్యాపార అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దామని వివరించారు.

**అవకాశాల గనిగా భారత్**

ప్రపంచవ్యాప్తంగా భారతీయులు కీలక స్థానాల్లో ఉన్నారని, అనేక దేశాల అభివృద్ధిలో మనవారి పాత్ర మరువలేనిదని సీఎం కొనియాడారు. టెక్నాలజీ, టెలికమ్యూనికేషన్స్ వంటి రంగాలను వేగంగా అందిపుచ్చుకోవడం వల్లే భారత్ అగ్రగామిగా ఎదుగుతోందన్నారు. ఒకప్పుడు సిలికాన్ వ్యాలీ వంటి ప్రాంతాలకు భారత్ నుంచి మేధో వలస జరిగిందని, కానీ ఇప్పుడు పరిస్థితి మారుతోందని అభిప్రాయపడ్డారు. నైపుణ్యం, వనరులు ఉన్నచోటికే అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయని, త్వరలోనే భారత్‌కు 'రివర్స్ మైగ్రేషన్' మొదలవుతుందని ఆయన జోస్యం చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో 60 శాతం భారత్‌లోనే ఉండటం దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భారత్ దూసుకుపోతోందని, భవిష్యత్తులో ఇతర దేశాలకు విద్యుత్ ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.

**జనాభా నిర్వహణపై డేంజర్ బెల్స్**

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు వృద్ధుల జనాభా పెరిగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఈ ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి ఏపీలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని చంద్రబాబు వివరించారు. ఒకప్పుడు ప్రజాప్రతినిధిగా కుటుంబ నియంత్రణ గురించి ప్రచారం చేసిన తాను, నేడు 'పాపులేషన్ మేనేజ్‌మెంట్' (జనాభా నిర్వహణ) ఆవశ్యకత గురించి మాట్లాడుతున్నానని తెలిపారు. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల్లో ఫెర్టిలిటీ రేటు 1.5కి పడిపోయిందని, దీనిని కనీసం 2.1కి తీసుకురావడమే లక్ష్యంగా కొత్త పాలసీని తీసుకొచ్చామని చెప్పారు.పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రజలంతా జనాభా వృద్ధిపై దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి ప్రోత్సాహకాలు అందిస్తున్నామని, మూడో బిడ్డ పుడితే రూ.25 వేల ఆర్థిక సాయంతో పాటు, నెలకు రూ.1000 అందించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. అలాగే చైల్డ్ కేర్ లీవ్ వంటి సౌకర్యాలపై కూడా ఆలోచన చేస్తున్నామన్నారు. గతంలో దేశానికి ఆస్తిగా ఉన్న పెద్ద కుటుంబాలు ఇప్పుడు మైక్రో ఫ్యామిలీలుగా మారిపోయాయని, ఈ విషయంలో ప్రజల ఆలోచనా దృక్పథాన్ని మార్చాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు.

కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ సహా 110 దేశాల నుంచి వచ్చిన 2700 మందికి పైగా ప్రతినిధులు, మేధావులు, వ్యూహకర్తలు హాజరైన ఈ సదస్సులో చంద్రబాబు ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. సహకార సమాఖ్య స్ఫూర్తితో కేంద్రంతోనూ, పొరుగు రాష్ట్రాలతోనూ సమన్వయం చేసుకుంటూ ఏపీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని సీఎం వివరించారు.

# భారత్‌లో పెరిగిన బిలియనీర్ల సంఖ్య...

- మొదటి పేజి తరువాయి

.గతేడాదితో పోలిస్తే ఈసారి కొత్తగా 24 మంది బిలియనీర్ల జాబితాలో చేరారు. దీంతో భారతీయ కుబేరుల మొత్తం సంపద 10 శాతం పెరిగి రూ.112.6 లక్షల కోట్లకు (112.6 ట్రిలియన్లు) చేరింది. 199 మంది సంపద పెరగ్గా, 109 మంది సంపద తగ్గడం లేదా స్థిరంగా ఉండటం గమనార్హం. ఈసారి సంప్రదాయ రంగాలకు మించి ఇతర రంగాల వారు కూడా జాబితాలో చోటు దక్కించుకున్నారు. అత్యధికంగా హెల్త్‌కేర్ రంగం నుంచి 53 మంది, ఇండస్ట్రియల్ గూడ్స్ నుంచి 36 మంది, కన్స్యూమర్ గూడ్స్ నుంచి 31 మంది కొత్తగా ఈ జాబితాలో చేరారు. అయితే తక్కువ మంది ఉన్నప్పటికీ, ఇంధన రంగం (ఎనర్జీ) అత్యధిక సంపదను కలిగి ఉంది. కేవలం 8 మంది బిలియనీర్లే రూ.18.3 లక్షల కోట్ల సంపదతో దేశీయ కుబేరుల మొత్తం సంపదలో 16 శాతం వాటాను కలిగి ఉన్నారు. నగరాల వారీగా చూస్తే ముంబై 95 మంది బిలియనీర్లతో దేశంలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. అయితే ఆసియా బిలియనీర్ క్యాపిటల్ హోదాను మాత్రం ముంబై కోల్పోయింది. 133 మంది కుబేరులతో చైనాలోని షెన్‌జెన్ నగరం ఆసియాలో టాప్ ప్లేస్‌కు చేరింది. ముంబైలో కొత్తగా 15 మంది బిలియనీర్లు చేరగా, ఇది న్యూయార్క్ (14), లండన్ (9) కంటే ఎక్కువ కావడం విశేషం. ఇక భారతీయ బిలియనీర్లలో మహిళల వాటా 7 శాతంగా ఉంది. మొత్తం 23 మంది మహిళా కుబేరుల వద్ద రూ.9.8 లక్షల కోట్ల సంపద ఉన్నట్లు హురున్ నివేదిక తెలిపింది. ప్రపంచ సగటు వయసు (65) కంటే భారతీయ బిలియనీర్ల సగటు వయసు (67) ఎక్కువగా ఉండటం గమనార్హం.

# హోర్ముజ్ జలసంధిలో ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ దాడి...

- మొదటి పేజి తరువాయి

షిన్హువా వార్తా సంస్థ కథనం ప్రకారం.. భద్రతా కారణాల దృష్ట్యా హోర్ముజ్ జలసంధిలో రాకపోకలను నిషేధిస్తూ ఇరాన్ నేవీ హెచ్చరికలు జారీ చేసింది. అయితే 'ప్రైమా' ట్యాంకర్ ఈ నిబంధనలను ఉల్లంఘించి ముందుకు సాగడంతో, ఐఆర్‌జీసీ డ్రోన్ ద్వారా ఆ నౌకపై దాడి చేసింది. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణించిన తర్వాత, గత ఎనిమిది రోజులుగా హోర్ముజ్ జలసంధి తమ పూర్తి నియంత్రణలో ఉందని ఐఆర్‌జీసీ తెలిపింది. అమెరికా, ఇజ్రాయెల్ వంటి శత్రు దేశాలకు చెందిన లేదా వాటికి మద్దతు తెలిపే వాణిజ్య నౌకలను ఈ మార్గంలో అనుమతించేది లేదని స్పష్టం చేసింది. అయితే, హోర్ముజ్ జలసంధిని పూర్తిగా మూసివేసినట్లు వస్తున్న వార్తలను ఇరాన్ ప్రభుత్వం ఖండించింది. అంతర్జాతీయ నిబంధనల ప్రకారమే నౌకల రాకపోకలు జరుగుతున్నాయని, జలసంధిని పూర్తిగా మూసివేసే ఆలోచన ప్రస్తుతానికి లేదని ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి సయీద్ ఖతిబ్‌జాదే తెలిపారు. కానీ, యుద్ధ సమయంలో జలసంధిని నియంత్రించే హక్కు తమకు ఉందని, అమెరికా, ఇజ్రాయెల్ నౌకలు లేదా మారువేషంలో వచ్చే యుద్ధ నౌకలను మాత్రం సైనిక లక్ష్యాలుగా పరిగణించి అడ్డుకుంటామని ఇరాన్ సైన్యం హెచ్చరించింది. ఖమేనీ మరణం తర్వాత ఇరాన్ ప్రతీకార దాడులు తీవ్రతరం చేయడంతో ఈ ప్రాంతంలో పరిస్థితి ఆందోళనకరంగా మారింది.

# జగన్ మద్య నిషేధం హామీ వెనుక కథ వేరే ఉంది

- మొదటి పేజి తరువాయి

లోకేశ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇప్పటికే 1,048 కోట్ల రూపాయల నగదు లావాదేవీల జాడను వెలికితీసిందని గుర్తుచేశారు. ఒకవైపు ముఖ్యమంత్రి హోదాలో జగన్ మద్య నిషేధం గురించి ప్రసంగాలు చేస్తుంటే, మరోవైపు ఆయన అనుచరులు అక్రమ మద్యం ద్వారా వేల కోట్లు గడించారని మండిపడ్డారు. ఈ క్రమంలో వేలాది పేద కుటుంబాలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా చితికిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ ప్రజలకు ఈ దోపిడీపై సమాధానం చెబుతారా? లేక మౌనంగా ఉండిపోతారా? అంటూ జగన్‌కు లోకేశ్ సూటి ప్రశ్న సంధించారు.

# ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీదుర్గపై నాన్ బెయిలబుల్ వారెంట్

- మొదటి పేజి తరువాయి

గతంలో సుప్రీం కోర్టు జారీ చేసిన ఆదేశాల మేరకు సిట్ అధికారులు ఈ కేసులో దర్యాప్తును లోతుగా పరిశీలించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీ దుర్గను ఈ కేసులో రెండవ నిందితురాలిగా (ఏ-2) చేర్చారు. ఈ మేరకు సిట్ అధికారులు రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టులో అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేశారు. పోలీసులు సమర్పించిన ఛార్జిషీట్‌ను, సాక్ష్యాధారాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం.. లక్ష్మీ దుర్గపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. కోర్టు ఆదేశాలు వెలువడిన వెంటనే పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం లక్ష్మీ దుర్గ ఆచూకీ కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.

# చంద్రబాబు పాపులేషన్ పాలసీపై షర్మిల సెటైర్

- మొదటి పేజి తరువాయి

సమంజసమని ఆమె ప్రశ్నించారు. "చంద్రబాబు పాపులేషన్ పాలసీ హాస్యాస్పదం. ఉన్న బిడ్డలకే దిక్కులేదు... ఇప్పుడు ముగ్గురు పిల్లలను కనాలా? మీరిచ్చే బోడి 25 వేల కోసం మూడో బిడ్డను కనమంటారా? ఉద్యోగాలు లేక నిరుద్యోగులు ఆటోలు తోలుకుంటూ, ట్యాక్సీ డ్రైవర్లుగా బ్రతుకుతున్నారు. రాష్ట్రంలో మీరిచ్చిన హామీలు అమలు కాలేదు. మీరు, జగన్ గారు కలిసి రాష్ట్రాన్ని 12 లక్షల కోట్ల అప్పుల కుప్ప చేశారు. సంక్షేమ పథకాలకు నిధులు లేవు. ఉద్యోగుల జీతాలు ఇచ్చే పరిస్థితి లేదు. ఆరోగ్య శ్రీ పథకానికి 3 వేల కోట్లు, ఫీజు రీయింబర్స్ పథకానికి 6 వేల కోట్లు బకాయిలు పెట్టారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో 15 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపారు. మాఫియాలు చేసుకుంటూ, రాష్ట్రాన్ని దోచుకుంటూ... బిడ్డలను కనమని చెబితే ఎలా చంద్రబాబు గారూ?" అంటూ షర్మిల ధ్వజమెత్తారు.

# పెన్ పవర్

రాయలసీమ

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి జిల్లా । చిత్తూరు జిల్లా । వై.ఎస్.ఆర్. కడప జిల్లా ।


## జొన్నవాడ శ్రీ కామాక్షితాయి అమ్మవారి సన్నిధిలో ఘనంగా సౌందర్య లహరి పారాయణం





బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ 7. వేమిరెడ్డి దంపతుల సమక్షంలో 500 మంది మహిళలతో సౌందర్య లహరి ఆలాపన.గురువాయూర్ నుండి జొన్నవాడ వరకు.. నేరెళ్ల పద్మశ్రీ, పద్మావతి బృందం అద్భుత ఆధ్యాత్మిక ప్రయాణం. ఆది శంకరాచార్యులు రచించిన సౌందర్య లహరి పారాయణంతో అమ్మవారి అనుగ్రహం మరియు మానసికంగా ఎంతో స్వాంతన. మన సంస్కృతీ సాంప్రదాయాలు భావి తరాలకు చేరవేసే ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలి.గత ప్రభుత్వ హయాంలో 50 లక్షల లోటుతో ఆలయ ఉద్యోగుల జీత భత్యాలతో పాటు బ్రహ్మోత్సవాలు కూడా నిర్వహించుకోలేని పరిస్థితి.నేడు జొన్నవాడ ఆలయంలో 3 కోట్ల డిపాజిట్లు ఉండడం కూటమి పాలన సుపరిపాలనకు నిబద్ధతకు తార్కాణం. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి. ప్రముఖ పుణ్యక్షేత్రం జొన్నవాడ శ్రీ కామాక్షితాయి అమ్మవారి ఆలయం వున్న కోవూరు నియోజకవర్గానికి ఎమ్మెల్యే కావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి బుచ్చిరెడ్డి పాళెం మండలం లోని ప్రముఖ పుణ్యక్షేత్రం జొన్నవాడ శ్రీ కామాక్షితాయి అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన 'సౌందర్య లహరి' మరియు 'మూక పంచశతి' పారాయణ కార్యక్రమంలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మరియు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జొన్నవాడ కామాక్షి అమ్మవారి సన్నిధికి విచ్చేసిన వేమిరెడ్డి దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం వేమిరెడ్డి దంపతులకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలతో పాటు అమ్మవారి జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం 500 మంది మహిళలు సౌందర్య లహరిని పారాయణమనే అద్భుత ఆధ్యాత్మిక ఘట్టాన్ని వీక్షించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గార్లు నిర్వాహకులను ప్రశంసించారు. ఆది శంకరాచార్యులు రచించిన సౌందర్య లహరి కేవలం శ్లోకం మాత్రమే కాదని, అది అమ్మవారి అనుగ్రహమని, దీనివల్ల ప్రజలకు ఆధ్యాత్మికంగా, మానసికంగా ఎంతో స్వాంతన చేకూరుతుందని వారు పేర్కొన్నారు.మన సంస్కృతీ సాంప్రదాయాలు భావి తరాలకు చేరవేసే ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని ఆమె ఆకాంక్షించారు. గత ప్రభుత్వ హయాంలో 50 లక్షల లోటుతో ఆలయ ఉద్యోగుల జీత భత్యాలతో పాటు బ్రహ్మోత్సవాలు కూడా నిర్వహించుకోలేని పరిస్థితిలో వున్న జొన్నవాడ ఆలయం నేడు 3 కోట్ల డిపాజిట్లు ఉండడం కూటమి పాలన నిబద్ధతకు తార్కాణం అన్నారు. జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారి సన్నిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన పద్మావతమ్మ, పద్మశ్రీ బృందాన్ని వేమిరెడ్డి దంపతులు ప్రత్యేకంగా అభినందించారు. శృంగేరీ పీఠం వారి ఆన్‌లైన్ క్లాసుల ద్వారా శిక్షణ పొంది సామాన్య ప్రజలకు సౌందర్య లహరిని చేరువ చేస్తున్న బృందం కృషితో ఇప్పటికే జనవరిలో గురువాయూర్‌లో మొదటి కార్యక్రమం జరిగిందని ఇప్పుడు రెండో కార్యక్రమం జొన్నవాడలో నిర్వహించడం సంతోషకరమని వారు కొనియాడారు. ప్రజలందరిపై కామాక్షితాయి, మల్లికార్జున స్వామి ఆశీస్సులు మెండుగా ఉండాలని వారు ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జొన్నవాడ ఆలయ ఛైర్మెన్ తిరుమూరు అశోక్ రెడ్డి, ఆలయ పరిపాలనాధికారి శ్రీనివాసులు రెడ్డి, ఆలయ పాలక మండలి సభ్యులతో పాటు స్థానిక తెలుగుదేశం మరియు కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు.

## నిరంతరం ప్రజల్లోనే ఉంటాం.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకువెళ్తాము.

240 పనుల్లో 238 పనులు పూర్తి.





నెల్లూరు పెన్ పవర్ 7. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 33వ డివిజన్, నేతాజీ నగర్, 3వ వీధిలో 14 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సీ.సీ. రోడ్డు పనులను కార్పొరేషన్ అధికారులు మరియు కూటమి నాయకులతో కలసి పరిశీలించిన టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి 33వ డివిజన్ అభివృద్ధికి 3 కోట్ల 52 లక్షల రూపాయల నిధులు కేటాయించాము. టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. స్థానిక ప్రజల సూచనలు, అభ్యర్ధన మేరకే అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. చెప్పిన మాట ప్రకారం 60 రోజుల్లో 240 పనులు పూర్తి చేసి, మార్చి 3వ వారంలో కూటమి నాయకుల సమక్షంలో ప్రజలచేతే ప్రారంభోత్సవాలు చేయిస్తాం. టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో, నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సారథ్యంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. నెల్లూరు రూరల్ అభివృద్ధికి తోడ్పాటునిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ యువనేత, రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ మరియు నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఎల్లవేళలా మీ ఆశీస్సులు ఉండాలి. టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. పై కార్యక్రమంలో క్లస్టర్ ఇంఛార్జ్ లు మన్నెం పెంచల నాయుడు, జలదంకి సుధాకర్, కో క్లస్టర్ ఇంచార్జ్ ఎల్.పి. కృష్ణా రెడ్డి, 33వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు కరణం హజరత్ నాయుడు, టిడిపి నాయకులు రాజేష్, అలగల ప్రభాకర్, నాగేంద్ర సింగ్, కటారి వెంకట రమణయ్య, షేక్. సయ్యద్ బాబు, రమణయ్య నాయుడు, రత్నం, శ్రీనివాసులు రెడ్డి, కిషోర్ రాజు, షేక్.మస్తాన్, డిష్ చిన్న, నవీన్, మాధురి, మురగ, ఖాదర్ వల్లీ, షేక్. షఫీ, నాని, మౌలాలి, పవన్, నరేష్, మస్తాన్, చందు, మోహాలివ్, వినయ్, విజయ్, ఆనంద్, సోమశేఖర్, ప్రసాద్, సాదిక్, సుబాష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## చక్రస్నాన ఉభయం.. స్వామివారి అనుగ్రహం





కోవూరు పెన్ పవర్ మార్చ్ 7. వైభవోపేతంగా ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి చక్రస్నానం ముఖ్య అతిథులుగా పాల్గొన్న వేమిరెడ్డి దంపతులు ఆధ్యాత్మిక శోభతో పులకించిన కొండ బిట్రగుంట కలియుగ దైవం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి చక్రస్నాన ఉభయం స్వామివారి అనుగ్రహంతోనే సాధ్యమైందని నెల్లూరుపార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు అన్నారు. కొండ బిట్రగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు ఉదయం స్వామివారికి అంగరంగ వైభవంగా స్నపన తిరుమంజనం,చక్రస్నానం జరిగాయి. ముందుగా స్వామి వారి కోనేరు వద్దకు చేరుకున్న వేమిరెడ్డి దంపతులకు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణా రెడ్డి, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం వేమిరెడ్డి దంపతులు అర్చకులతో కలిసి చక్రతాళ్వారుకు కోనేరులో చక్ర స్నానం చేశారు. గోవింద నామ స్మరణల మధ్య కోనేరు ప్రాంగనం మార్మోగిపోయింది. అనంతరం కొండపై స్వామివార్లను వేమిరెడ్డి దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేదాశిర్వాదం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెంకటేశ్వర స్వామి వార్లకు చక్ర స్నానం మా చేతులమీదుగా నిర్వహించడం అదృష్టమన్నారు. ఇక ప్రతి బ్రహ్మోత్సవాల్లో చక్ర స్నానం ఉభయం తాము నిర్వహిస్తామన్నారు. చోళుల కాలం నాటి కోనేరును బాగు చేసి నిర్మించడం గొప్ప వరమని చెప్పారు. ఇది మాకు స్వామి వారి అనుగ్రహమని చెప్పారు. ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషముగా ఉండాలని, రాష్ట్రం అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు.

## కార్యకర్తల సమావేశం లో పాల్గొన్న టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి





నెల్లూరు పెన్ పవర్ 7. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 31వ డివిజన్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 30 మరియు 31వ డివిజన్ ల టీడీపీ నాయకులు మరియు కార్యకర్తల సమావేశం లో పాల్గొన్న టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పై కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ లు, కో క్లస్టర్ ఇంచార్జ్ లు,

టిడిపి డివిజన్ అధ్యక్షులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని చుక్కల దుప్పి మృతి





బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ మార్చ్ 7. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం మండలం గంగవరం కాలవ వద్ద జరిగిన ఒక ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఒక గుర్తుతెలియని వాహనం చుక్కల దుప్పిని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందింది ఈ దారుణ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. రాత్రిపూట రోడ్డు దాటుతున్న అమాయక చుక్కల దుప్పిని వేగంగా వచ్చిన వాహనం నిర్దాక్షిణ్యంగా ఢీకొట్టి, కనీసం ఆపకుండా వెళ్లిపోవడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఘటన గంగవరం కాలువ సమీపంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. రోడ్డు పక్కన మృతిచెందిన దుప్పిని గమనించిన స్థానికులు వెంటనే బుచ్చిరెడ్డిపాలెం పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని ప్రాథమిక పరిశీలన చేశారు. చుక్కల దుప్పి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. గుర్తుతెలియని వాహనం డ్రైవర్ నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనం, దాని డ్రైవర్ కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. సమీపంలోని సీసీటీవీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. రోడ్డు భద్రత నియమాలను ఉల్లంఘించి, ఒక అమాయక ప్రాణం తీసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించి, మృతిచెందిన దుప్పిని వారికి అప్పగించారు

## పులి రామచంద్ర కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి





శ్రీకాళహస్తి , పెన్ పవర్ , మార్చి , 07 : ఇటీవల అరెస్టై బెయిల్‌పై విడుదలైన పులి రామచంద్రను మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా పులి రామచంద్ర నివాసానికి వెళ్లిన ఆయన, రామచంద్ర సతీమణి పులి మౌనికతో పాటు కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పార్టీని నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటుందని, ఎలాంటి పరిస్థితుల్లోనూ భయపడాల్సిన అవసరం లేదని మధుసూదన్ రెడ్డి భరోసా ఇచ్చారు. మీరు ధైర్యంగా ఉండాలని, పార్టీ తరఫున తన పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, యుగంధర్ రెడ్డి, ఎల్ఐసీ చంద్ర, అప్పిని సుధాకర్, ఉత్తరాజి శరవణ కుమార్, కంట ఉదయ్ కుమార్, బుల్లెట్ జై శ్యామ్ రాయల్, మున్నా రాయల్, రామచంద్రారెడ్డి, కామి వెంకటేశ్వర్లు, శ్రీవారి సురేష్, డాక్టర్ శంకర్, ముని కృష్ణారెడ్డి, లక్ష్మీపతి, వళ్లం గోపి, మధు రెడ్డి, పటాన్ ఫరీద్, పసల సురేష్, మని, అట్ల రమేష్, అస్లాం, జల్లేషా, ఫజల్, సి.ఆర్.టి ప్రసాద్, గుణ, శివ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ శ్రీ లక్ష్మీ ఔదార్యం

అనంతపురం : పెన్ పవర్, మార్చి, 07: అనంతపురం నగరపాలక సంస్థ 40 డివిజన్ కార్పొరేటర్ నలబోలు శ్రీ లక్ష్మి, ఆమె భర్త డాక్టర్ నలబోలు మధు రాయల్ శనివారం 58 వ సచివాలయం పరిధిలో పార్వతమ్మ కాలనీ ఆజాద్ నగర్ సత్యదేవ్ నగర్ రంగ రెడ్డి కాలనీలలో మంచానికి పరిమితమై నడవలేకున్నా ఇంటికి పరిమితమైన వృద్ధులకు క్యాన్సర్ తలసేమియా ఎయిడ్స్ డయాలసిస్ కిడ్నీ రోగులకు మూగ చెవిటి అంగవైకల్యం రెండు కన్నులు చూపులేని వారికి మానసిక వికలాంగులకు 85 సంవత్సరాలు దాటిన వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.5000 చొప్పున అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే గౌరవనీయులు దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ సూచనల మేరకు ఆర్థిక సాయం చేస్తామని స్థానిక డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి నలుబోలు శ్రీ లక్ష్మీ టిడిపి నాయకులు డాక్టర్ నలుబోలు మధు రాయల్ తెలియజేశారు కావున ఈ అవకాశం సద్విని చేసుకోవాలని కార్పొరేటర్ తెలియజేశారు.




## టిడిపి నాయకులు శ్రీధర్ నాయుడు ను పరామర్శించిన చేజర్ల





కోవూరు పెన్ పవర్ మార్చ్ 7. కోవూరు మండలం గంగవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గూటూరు శ్రీధర్ నాయుడు మాతృమూర్తి రామా దేవి ఇటీవల శివక్యం చెందగా ,నెల్లూరు లోని వారి నివాసంలో శ్రీధర్ నాయుడు తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి ఈరోజు పరామర్శించారు వీరి వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు బుధవరపు శివకుమార్, ఇంటూరి విజయ్,గొర్రెపాటి నరసింహ తదితరులు ఉన్నారు

# మసీదులకు ఇఫ్తార్ విందు ఇచ్చిన ఎమ్మెల్యే



బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ మార్చ్ 7. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో ముస్లిం సోదరుల పట్ల తమ అభిమానాన్ని చాటుకుంటూ ఉపవాస దీక్షలు చేపడుతున్న ముస్లిం సోదరులకోసం ఇఫ్తార్ (ఉపవాస విరమణ) సమయంలో భోజన ఏర్పాట్లు చేశారు. బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలోని ఖాజా నగర్ లోని అల్ అమీన్ మసీదు, మక్కా మసీదు, మదీనా మసీదు, అహలే హదీస్ మసీదులతో పాటు కాశి పాలెం లోని అల్ హబీబ్ మసీదులో ఉన్న ముస్లిం సోదరులకు భోజన పంపిణి చేశారు. ఖాజా నగర్ మరియు కాశీపాలెం ప్రాంతాల్లోని ముస్లిం పెద్దలు, యువకులు ఈ కార్యక్రమం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలియజేశారు. మత సామరస్యాన్ని పెంపొందించే ఉద్దేశంతో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చేపట్టిన భోజన పంపిణి కార్యక్రమం పట్ల స్థానిక ముస్లిం పెద్దలు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే తరపున చేపట్టిన ఇఫ్తార్ (ఉపవాస విరమణ) భోజన పంపిణి కార్యక్రమాన్ని భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా మైనారిటీ నాయకులు పర్యవేక్షించారు.

# ముస్లిం సోదరులతో విందు కోటంరెడ్డి





నెల్లూరు పెన్ పవర్ మార్చ్ 7. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 34వ డివిజన్, ప్రగతి నగర్ నందు బిలాల్ మసీద్ లో జరిగిన ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులతో కలిసి పాల్గొన్న టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి. పవిత్ర రంజాన్

మాస దీక్షలను నిష్ఠగా ఆచరిస్తోన్న ముస్లిం సోదరులందరికీ శుభాకాంక్షలు తెలియజేసిన టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి.

# 92 వ రోజుకు చేరిన గూడూరు జిల్లా సాధన పోరాటం




గూడూరు, పెన్ పవర్, మార్చి,07: గూడూరును ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ గత 92 రోజులుగా గూడూరు గాంధీ బొమ్మ సెంటర్‌లో నిర్వహిస్తున్న నిరసన శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. గూడూరు పట్టణం మరియు పరిసర ప్రాంతాల ప్రజలు తండోపతండాలుగా శిబిరానికి చేరుకుని సంఘీభావం తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గూడూరును వెంటనే జిల్లాగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. “జై జై గూడూరు... గూడూరు జిల్లా కావాలి” అంటూ నినాదాలతో శిబిరం ప్రాంగణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ సౌతిండియా వైస్ ప్రెసిడెంట్ కంకణాల పెంచల నాయుడు, యారం వెంకట సుబ్బయ్య, మంజులమ్మ, డాక్టర్ జే. శివకుమార్, శేఖర్ సాల్, జి. అనిల్ కుమార్, విజయ, శ్రీగౌరి, ఉప్పు రాము, ఎల్లసిరి సుబ్బారెడ్డి, కనగలూరు చంద్రశేఖర్, చిరంజీవి, అళగర్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం త్వరలోనే గూడూరును జిల్లాగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు.

# విద్య లేని వారు గుడ్డి వారితో సమానం...ఎమ్మెల్యే షాజహాన్ బాషా



గూడూరు, పెన్ పవర్, మార్చి,07: విజయవాడ నుండి తిరుగు ప్రయాణంలో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా గూడూరు పట్టణంలోని జామియా మసీదును ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మసీదు వద్ద ముస్లిం మత పెద్దలు, స్థానిక ప్రజలు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ ముస్లిం సమాజ అభివృద్ధికి విద్య అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ముస్లిం తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి మంచి భవిష్యత్తు కల్పించాలని సూచించారు. అలాగే రంగనాథ కమిషన్ నివేదికల ప్రకారం దేశంలో ముస్లిం సమాజం విద్యా, ఆర్థిక రంగాల్లో ఇంకా చాలా వెనుకబడి ఉందని తెలిపారు. సమాజం అభివృద్ధి చెందాలంటే విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలోమసీదు కమిటీసభ్యులు, స్థానికముస్లిం పెద్దలు,యువకులు పాల్గొన్నారు.

# మహిళా చైతన్యంతోనే సమాజ వికాసం -- టూ టౌన్ ఎస్ఐ జ్యోతి



శ్రీకాళహస్తి, పెన్ పవర్, మార్చి,07: మహిళా చైతన్యంతోనే సమాజ వికాసం సాధ్యమవుతుందని టూ టౌన్ ఎస్ఐ జ్యోతి అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ శ్రీకాళహస్తి శాఖ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఉద్దేశించి ఎస్ఐ జ్యోతి మాట్లాడుతూ అన్ని రంగాల్లోనూ మహిళలు అగ్రస్థానంలోకి రావాలని ఆకాంక్షించారు. అసాంఘిక శక్తుల పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చట్టాలు, హక్కులపై అవగాహన కలిగిన మహిళలు చైతన్యవంతులవుతారని, తద్వారా మహిళా సాధికారత సాకారమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నరసింహారావు, ఎస్ఎఫ్ఐ నాయకులు చుట్టు గురవయ్య, తులసి, నాగ, సుకుమార్, ఐద్వా నాయకులు రాధమ్మ, రేవతి తదితరులు పాల్గొన్నారు.

# మోకాళ్లపై నిలబడి కార్మికుల నిరసన

రాజంపేట పెన్ పవర్, మార్చి, 07: సమస్యల సాధన కోసం పారిశుధ్య కార్మికులు చేపట్టిన రిలే దీక్షలలో రెండవ రోజు మున్సిపల్ కార్యాలయం వద్ద మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కన్వీనర్ పి.వి.రమణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులంతా నిమ్న కులాలకు చెందిన వారేనని, తమపై కనీస దయచూపి కనీస వేతనం అమలు చేయాలని, మురికి కాలువలో పనిచేయడం వలన తమకు అనారోగ్య సమస్యలు పొంచి ఉన్నాయని, తమకు ఇఎస్ఐ అమలు చేసి ఉచిత వైద్యం అందించడంతోపాటు రూ.5 లక్షల బీమా వసతి కల్పించాలని డిమాండ్ చేశారు.

# కేసుల పరిష్కారానికి చొరవ చూపండి. -- పోలీసులకు శ్రీనివాస నాయక్ సూచనలు.





శ్రీకాళహస్తి, పెన్ పవర్, మార్చి, 07 : ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్ నాయక్ పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. శనివారం శ్రీకాళహస్తి పట్టణంలోని కోర్టు ఆవరణలో నిర్వహించిన పోలీసు అధికారుల సమావేశంలో ఆయన ఈ విషయాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్చి 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకోవడం ద్వారా సమయం, ధనం ఆదా అవుతాయని తెలిపారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు అవుతుందని, దానికి అప్పీల్ చేసే అవకాశం ఉండదని పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్‌లో వివిధ రకాల సివిల్ కేసులతో పాటు రాజీకి లోబడే క్రిమినల్ కేసులను కూడా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. అలాగే కోర్టులో పెండింగ్‌లో లేని ప్రీ-లిటిగేషన్ కేసులను కూడా రాజీ ద్వారా పరిష్కరించవచ్చని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా పోలీసులు, న్యాయవాదులు కలిసి ఎక్కువ సంఖ్యలో కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్ నాయక్, సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి, జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ, శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, అలాగే శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వాయు లింగేశ్వర సేవలో పలాస ఎమ్మెల్యే.





శ్రీకాళహస్తి, పెన్ పవర్, మార్చి ,07 : పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష శనివారం కుటుంబ సభ్యులతో కలిసి శ్రీకాళహస్తిలోని శ్రీ కాళహస్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆమెకు స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు ఆలయ ఎపిఆర్వో రవి, తెదేపా నాయకులు రమణ, ఈశ్వర్.వి పరిటాలలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీషకు పాతాళ వినాయకుడు, అనంతరం స్వామి అమ్మవార్ల అంతరాలయంలో ప్రత్యేక దర్శనం కల్పించారు. దర్శనం అనంతరం శ్రీ మృత్యుంజయ లింగం వద్ద ఆలయ అధికారులు స్వామి అమ్మవారి చిత్రం పటం, తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు మరియు ఇతరులు పాల్గొన్నారు.



# దివ్యాంగులకు భరోసా విపిఆర్ ట్రై సైకిళ్లు





నెల్లూరు పెన్ పవర్ మార్చ్ 7. కొండాపురంలో 4, రూరల్ పరిధిలో ఒకరికి ట్రై సైకిళ్ల అందజేత ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలి ఎంపీ వేమిరెడ్డి దివ్యాంగుల్లో ఆత్మ విశ్వాసం నింపేలా ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లను అందజేస్తున్నామని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని విపిఆర్ నివాసంలో ఐదుమంది దివ్యాంగులకు ఆయన ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్లు అందించారు. ఇందులో కొండాపురం మండలం తూర్పు యర్రబల్లి గ్రామంలో 4 దివ్యాంగులకు, నెల్లూరు రూరల్ పరిధిలో ఒక వ్యక్తికి ట్రై సైకిల్ అందజేశారు. దివ్యాంగులు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు.

ఎలక్ట్రిక్ ట్రై సైకిల్స్ ద్వారా దివ్యాంగులు ఎవరి సాయం లేకుండానే బయటకు వెళ్లి స్వయం ఉపాధి పొందాలన్నారు. ఆత్మ విశ్వాసానికి వైకల్యము అడ్డుకాదని నిరూపించాలని దివ్యాంగులను సూచించారు. వారికి ఇచ్చిన ట్రై సైకిళ్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# అంగన్వాడీ సిబ్బందికి వైద్య పరీక్షలు -- ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దని అధికారుల సూచనలు








శ్రీకాళహస్తి రూరల్ , పెన్ పవర్, మార్చి,07 : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని అంగన్వాడీ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో అంగన్వాడీ టీచర్లు, సహాయకులకు రక్తపరీక్షలు, బీపీ, షుగర్ తదితర ఆరోగ్య పరీక్షలను డాక్టర్లు సుధీర్, రంజిత నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ గ్రేడ్-వన్ సూపర్వైజర్లు హరిత, ప్రియాంక అంగన్వాడీ సిబ్బందికి ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఒత్తిడిని తగ్గించుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. మహిళల ఆరోగ్యం కుటుంబ ఆరోగ్యానికి పునాదిగా ఉంటుందని, ఆరోగ్యంపై అశ్రద్ధ చేయకుండా తరచుగా పరీక్షలు చేయించుకోవాలని వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలకు హెల్త్ కార్డులు మంజూరు చేస్తున్న నేపథ్యంలో ఈ వైద్య పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆసియా బేగం, సూపర్వైజర్లు మల్లీశ్వరి, మంజుల, ఆదిలక్ష్మి, ప్రగతి స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, అంగన్వాడీ సిబ్బంది,సహాయకులు,వైద్యసిబ్బంది,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# రోడ్డు సౌకర్యం ఉన్న బస్సు సౌకర్యానికి నోచుకోని రోసనూరు,రాజుపాలెం గ్రామస్తులు...

పెళ్లకూరు, పెన్ పవర్, మార్చి 07 గ్రామాల అభివృద్ధిలో కనీస మౌలిక వసతులు అవసరం అందులో రహదారుల సౌకర్యం ఒకటి అనేక గ్రామాలు రహదారులు సౌకర్యం కు కూడా నోచుకోక ఇబ్బంది పడే గ్రామాలు కొకోల్లలు అయితే అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని అన్నా చందంగా తిరుపతి జిల్లాలోని పెళ్లకూరు మండల పరిధిలోని రోసనూరు రాజుపాలెం పంచాయతీ విచిత్ర పరిస్థితిని ఎదుర్కొంటున్న వైనం కళ్ళ ముందు కనబడుతుంది. నాయుడుపేట నుంచి చెన్నై హైవే మీదగా రోసనూరుకు వెళ్లాలంటే 15 కిలోమీటర్ల ప్రయాణించవలసి ఉంది నెల్లబల్లి సమీపంలో అటవి ప్రాంతం గుండా రోసనూరు పంచాయతీకి అటవీ మార్గంలో వెళ్లాలి సుమారు 8 కిలోమీటర్లు హైవే పరిధి నుండి అటవీ మార్గంలో వెళ్లాలి బీటీ రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ బస్సులో నడపకపోవడంతో ఈ ప్రాంతంలో ఉన్న ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఇదే మార్గంలో సూళ్లూరుపేట బస్సు డిపో వాళ్ళు ఈ మార్గం గుండా గతంలో ఐదు ట్రిప్పులు, తరువాత మూడు ట్రిప్పులు బస్సులు నడిపేవారు. ప్రస్తుతం నాయుడుపేట నుండి ఉదయం, సాయంత్రం శిరసనం బేడు రోడ్డు మీదుగా బంగారం పేట, మోదుగులపాలెం మీదుగా రోసనూరు మీదగా సూళ్లూరుపేట వెళ్ళిపోతుంది. తిరిగి రాకపోవడంతో ప్రజలకు ఉపయోగకరంగా ఉండడం లేదు. పైగా హైవే మార్గం కంటే ఈ మార్గంలో రెట్టింపు ఉంటుంది.రోసనూరు పంచాయతీలో బీసీ సమక్షేమ హాస్టల్, ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉన్నాయి. ఈ మార్గం రెట్టింపు కావడంతో ఎలా పాలాలేని సమయాల్లో బస్సు తిరగడం వల్ల ప్రయాణికులు,విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు రోసనూరు పరిశ్రమలతో పాటు వ్యాపార సమస్యలు వెలిసి ఉన్నాయి.సమీపంలో దీని ప్రయాణికులు, విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. రోసనూరు సమీపంలో పరిశ్రమలతో పాటు వ్యాపార సంస్థలు వెలిసి ఉన్నాయి. సూళ్లూరుపేట, నాయుడుపేట, మేనకూరు లలో పరిశ్రమలు కూడా ఉన్నాయి. నాయుడుపేట, సూళ్లూరుపేట కు వెళ్లే విద్యార్థులు ఉన్నారు. వ్యాపారస్తులు కూడా చెన్నై పట్టణంకు వైద్య సౌకర్యాల కోసం, వ్యాపారాల కోసం వెళుతూ ఉంటారు. అయితే బస్సు ఈ ప్రాంతంలో తిప్పకపోవడంతో ప్రజలు గత్యంతరం లేక ప్రాణాంతకం అయినప్పటికీ ఆటోలను ఆశ్రయించి ప్రాణాలు పిడికెట్లో పెట్టుకుని ప్రయాణం చేయవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది అటవీ ప్రాంతం కావడంతో పైగా హైవే నుండి విద్యుత్ దీపాలు కూడా లేకపోవడంతో అభద్రత భావంతో ప్రజలు ప్రయాణం చేయవలసిన దుస్థితి నెలకొంది. మహిళలకు, విద్యార్థులకు, వికలాంగులకు ఆర్టీసీలలో ఉచిత సౌకర్యాలు కల్పిస్తున్న బస్సు సౌకర్యం లేని కారణంగా సంక్షేమ పథకాలను నోచుకోక పోగా అధిక భారంతో ప్రాణాలు పిడికిట్లో పెట్టుకుని ప్రయాణం చేయవలసి వస్తుందని అనేక మంది విద్యార్థులు చదువుల దృష్ట్యా తమకు భారమైనప్పటికీ భద్రతా కారణాల దృష్ట్యా పిల్లలను తల్లిదండ్రులు పట్టణ ప్రాంతాలలో చదివించవలసిన పరిస్థితి, వ్యవసాయదారులు, వ్యాపారస్తులు లగేజీలు అధిక భారంతో రవాణా సౌకర్యం చేయవలసిన పరిస్థితి మండలంలో అతిపెద్ద



పంచాయతీల్లో ఒకటైన రోసనూరు రాజుపాలెం పంచాయతీ ఇలాంటి దుస్థితి నెలకొనడం బాధాకరం ఈ పంచాయతీ ప్రధాన పార్టీలకి ప్రజా ప్రతినిధులు ఉన్నప్పటికీ పట్టించుకోకపోవడం దురదృష్టకరం పరిస్థితి... ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడం తప్ప సమస్యలు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు సంబంధించిన సమస్యను శీఘ్రంగా పరిష్కరించాలని కోరుతున్నారు. మరి అధికారులు ఏ విధంగా స్పందిస్తారో కాలమే నిర్ణయించాలి...

# ప్రగతి సేవ సంస్థ అధ్వర్యంలో ఘనంగా మహిళా క్రీడా పోటీలు




గూడూరు, పెన్ పవర్, మార్చి,07: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రగతి సేవా సంస్థ, అధ్వర్యంలో గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న మహిళా డాక్టర్లు, సిబ్బందికి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమం శనివారం ఉదయం అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో జరిగింది. ఈ సందర్భంగా 35 సంవత్సరాల లోపు మహిళలకు 100 మీటర్ల పరుగుపందెం, బాల్ త్రో, గోల్డ్ రష్ పోటీలు నిర్వహించగా, 35 సంవత్సరాల పైబడిన వారికి 75 మీటర్ల పరుగుపందెం, బాల్ త్రో, బెలూన్ బరస్ట్ పోటీలు నిర్వహించారు. అదనంగా లక్కీ కార్డ్ అనే కామన్ ఈవెంట్ కూడా ఏర్పాటు చేశారు. పోటీలలో విజేతలైన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా పాల్గొని పలువురిని సన్మానించి, క్రీడల్లో విజయం సాధించిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మహిళా సిబ్బందికి క్రీడా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రగతి సేవా సంస్థ ఇలాంటి కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ ప్రసన్న, డాక్టర్ చలపతి, నర్సింగ్ సూపరింటెండెంట్ సువర్ణకాంతం, హాస్పిటల్ సిబ్బంది మౌల, ప్రగతి కుటుంబ సభ్యులు వాకటి రామ్మోహన్ రావు, శ్యామ్, తూపిలి యశ్వంత్, వెంకట్రావు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# మలేషియాలో అంతర్జాతీయ బాల్ బ్యాడ్మింటన్ టెస్ట్ సిరీస్‌లో స్వర్ణలత ప్రతిభ -- భారత జట్టుకు గోల్డ్ మెడల్





శ్రీకాళహస్తి, పెన్ పవర్, మార్చి,07 : మలేషియాలోని కౌలాలంపూర్‌లో ఫిబ్రవరి 27 నుండి మార్చి 4, 2026 వరకు నిర్వహించిన అంతర్జాతీయ బాల్ బ్యాడ్మింటన్ టెస్ట్ సిరీస్‌లో భారత జట్టు ప్రథమ స్థానం సాధించి గోల్డ్ మెడల్‌ను కైవసం చేసుకుంది. ఈ పోటీల్లో భారతదేశం తరపున బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బి బి ఎఫ్ ఐ) ఆధ్వర్యంలో పురుషుల మరియు మహిళల జట్లు పాల్గొన్నాయి. ఈ మహిళా జట్టులో తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మహిళా డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థిని మల్లాపు స్వర్ణలత ప్రాతినిధ్యం వహించింది. ఆమె తన ప్రతిభను చాటుతూ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. స్వర్ణలత సాధించిన ఈ ఘన విజయాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్, పీడీ నరసింహారావు, సీనియర్ ప్లేయర్ ప్రభాకర్, కోచ్ క్రాంతి కుమార్ ఆమెను సత్కరించి అభినందనలు తెలిపారు. అలాగే చిత్తూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సెక్రటరీ మరియు రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పసుపులేటి బాలాజీ, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు సి. వెంకటస్వామి స్వర్ణలతకు అభినందనలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు.

# కార్డెన్ సెర్చ్ లో నకిలీ మద్యం లభ్యం.

## -- గంజాయి సేవిస్తున్న వ్యక్తితో పాటు నకిలీ మద్యం స్వాధీనం.







తిరుపతి క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, మార్చి 7. తిరుపతి నగర శివార్లు లోని శేషాద్రి నగర్ లో పోలీసులు కార్డెన్ సెర్చ్ చేపట్టారుపోలీసులు, గంజాయి సేవిస్తున్న ఓ వ్యక్తితో పాటు నకిలీ మద్యం తయారు చేస్తున్న కొందరిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. తిరుపతి రూరల్ 5మంది సిఐ లు 10మంది సబ్ ఇన్స్పెక్టర్లు సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. శేషాద్రి నగర్ లో గంజాయి సేవిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు

అలాగే పాడిపేటలో నకిలీ మద్యం తయారు చేస్తున్న మద్యంతో పాటు మద్యం సీసాలను స్వాధీనం పరుచుకున్నారు. సరైన పత్రాలు లేని పలు వాహనాలను గుర్తించి వాహనాలను పోలీస్ స్టేషన్ ప్రాంతానికి తరలించారు . వాహనాలకు సంబంధించి పత్రాలు ఉంటే పోలీసులకు చూపించి తమ వాహనాలు తీసుకెళ్లాలని ప్రజలకు సూచనలు చేశారు. అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా ఉంటే సమాచారాన్ని పోలీసులకు అందించాలని కోరారు.

# శ్రీ గాయత్రి లో తల్లిదండ్రులకు పాదపూజ మహోత్సవం



గూడూరు, పెన్ పవర్, మార్చి,07: గూడూరు లోని శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా సాంప్రదాయ పద్ధతులతో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ నేటి విద్యార్థులకు తల్లిదండ్రుల ప్రాముఖ్యత తెలియ జేయడం, తల్లిదండ్రుల పట్ల వినయం, విధేయత , ప్రేమ వ్యక్తప రచడం, తల్లిదండ్రుల పట్ల కృతజ్ఞత భావం పెంపొందించాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అలాగే మన పురాణాల ప్రకారం విద్యార్థులకి తల్లిదండ్రుల దీవెనలు విశేష ఫలితాన్ని ఇస్తాయి. శ్రీ గాయత్రి స్కూల్ ముందు నుంచే నాలెడ్జ్ వాల్యూస్ లీడర్షిప్ అనే కాన్సెప్ట్ తో ముందుకు వెళుతూ ఉంది . వాల్యూస్ కాన్సెప్ట్ లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు హాజరై విజయవంతం చేసినందుకు తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు విద్యే కీలకం - గవర్నర్ అబ్దుల్ నజీర్




తిరుపతి/పెన్ పవర్/మార్చి 07 మహిళా సాధికారతకు విద్యే ప్రధాన సాధనమని, విద్యార్థులు సమాజ అభివృద్ధికి తమ జ్ఞానాన్ని వినియోగించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన 22వ స్నాతకోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమా వెన్నం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ విశ్రాంత శాస్త్రవేత్త శశికళ సిన్హాకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ మరియు డాక్టరల్ కోర్సులకు చెందిన మొత్తం 2,591 మంది విద్యార్థినులకు డిగ్రీలు అందజేశారు. వీరిలో 121 మందికి పీహెచ్‌డీ పట్టాలు ఇవ్వగా, ప్రతిభ కనబరిచిన 99 మంది విద్యార్థినులకు గోల్డ్ మెడల్స్ ప్రదానం చేశారు. గవర్నర్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచం వేగంగా మారుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, నానో టెక్నాలజీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, పునరుత్పాదక శక్తి వంటి ఆధునిక రంగాల్లో నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే పర్యావరణ పరిరక్షణ, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో విశ్వవిద్యాలయాలు పరిశోధనలను ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, మున్సిపల్ కమిషనర్ ఎన్. మౌర్య, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, యూనివర్సిటీ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా టపాకాయల తయారీ మరియు దుకాణాలలో విస్తృత తనిఖీలు.



తిరుపతి/పెన్ పవర్/మార్చి 07 తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్.సుబ్బరాయుడు ఐపీఎస్. ఈ రోజు జిల్లా వ్యాప్తంగా టపాకాయల తయారీ మరియు బాణసంచా దుకాణాలు మరియు గొడన్ ల ను ఆకస్మిక విస్తృత తనిఖీలు నిర్వహించారు ప్రత్యేక తనిఖీల భాగంగా ఈరోజు మధ్యాహ్నం తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ సుబ్బరాయుడు ఐపీఎస్.,గారు తిరుపతి రూరల్ మండలం, తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నీ కూపుచంద్ర పేట వద్ద గల రెండు టపాకాయల దుకాణాలను తనిఖీ చేయడం జరిగింది. తనిఖీ లలో లైసెన్స్, నిల్వ సామర్థ్యం, ఫైర్ సేఫ్టీ మరియు భద్రతా చర్యల పైన తనిఖీలు చేపట్టి, దుకాణదారులకు తగు సూచనలు మరియు ఆదేశాలు జారి చేశారు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని భద్రతా చర్యలు విధిగా పాటించాలని సూచించారు,ప్రజల భద్రత విషయంలో రాజీ లేదని నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు ఈ తనిఖీ లలో చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, తిరుచానూరు ఇన్స్పెక్టర్ సునీల్ కుమార్, తిరుపతి రూరల్ ఇన్స్పెక్టర్ మద్దయ్య ఆచారి తదితరులు పాల్గొన్నారు.

# మంగళగిరిలో వివాహ మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి







శ్రీకాళహస్తి,పెన్ పవర్, మార్చి,07: మంగళగిరి సీకే కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన శ్రీ కుసి శ్రీనివాస్ కుమారుని వివాహ మహోత్సవానికి శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. శ్రీకాళహస్తిలో వివాహ రిసెప్షన్‌లకు హాజరైన బొజ్జల రిషితా రెడ్డి శ్రీకాళహస్తి పట్టణంలో నిర్వహించిన వివిధ వివాహ రిసెప్షన్ కార్యక్రమాలకు ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషితా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్న ఆమె, వివాహ వేడుకల్లో పాల్గొన్న వారితో ఆత్మీయంగా ముచ్చటించారు.

# కుప్పం నియోజకవర్గ ప్రజలకేనా పింఛన్లు?

## మేమేమి పాపం చేశామని ఇంత వివక్ష
## సీఎం తీరును ఎండగడుతున్న పింఛన్ బాధితులు



పలమనేరు,పెన్ పవర్, మార్చి 07, దివ్యాంగులకు అండగా ఉంటాను, వితంతువులకు బాసటగా నిలుస్తాను, వృద్ధులకు చేయి అందిస్తాను,50 ఏళ్లకే పింఛన్లు ఇస్తాం, దరఖాస్తు చేసుకున్న నెలకి మంజూరు చేస్తాం ఓటు వేయండి అంటూ అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలు నెరవేరుస్తామంటూ ఎన్నికల ముందు డంఖా భజాయించారు,నమ్మి ఓట్లు వేశారు, అధికారంలోకి వచ్చారు 20 నెలలు గడుస్తోంది కొత్త పింఛన్ మంజూరు చేయలేదు,ఎదురు చూపులు తప్పడం లేదు.బాధితులు కార్యాలయాలు చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. ఇది రాష్ట్రంలోని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రక్క నియోజకవర్గమైన పలమనేరు నియోజకవర్గ ప్రజలు పింఛన్ల కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తూ, పడుతున్న మనోవేదన. ముఖ్యంగా కుప్పం నియోజక వర్గానికి పక్కనేఉన్న పలమనేరు నియోజకవర్గముతో బాటు ఇక్కడి వి.కోట మండల ప్రజలబాధ వర్ణనాతీతం అనే చెప్పవచ్చు.

కుప్పంలో మాత్రం పింఛన్లు మంజూరు?

అయితే కుప్పంలో అన్ని రకాల పింఛన్లు మంజూరు చేశారు. మిగతా వారికి కడగండ్లు నింపారు. ఇదేంటి వివక్షని రాష్ట్ర పింఛన్ బాధితులు దుమ్మెత్తి పోస్తున్నారు. దరఖాస్తు చేసుకోవడానికి అక్కడ మాత్రమే అవకాశం కల్పించారా,మాకెందుకు అవకాశం లేదు. కేవలం మేము మాత్రమే ఈరాష్ట్రంలో లేమా అంటూ నిలదీస్తున్నారు.పింఛన్ల మంజూరులో వివక్షపై పింఛన్ బాధితులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు ఎన్నికల ముందు నాకు ఓట్లు వేయండి.

దివ్యాంగులకు అండగా ఉంటానన్నారు,వృద్ధులకు అర్జీ పెట్టుకున్న వెంటనే ఇస్తామన్నారు, వితంతువులకు బాసటగా నిలుస్తామని మాటిచ్చారు.50 ఏళ్లకే పింఛన్లు మంజూరు చేసే బాధ్యత నాదే అంటూ నమ్మించారు, ఏదో సూపర్ సిక్స్ అమలు చేసామని డబ్బాకొట్టు కుంటున్నారు,గాని వివిధ ప్రమాదాలలో విగత జీవులుగా కాళ్ళు చేతులు,కొంత మందికి కళ్ళులేక తినడానికి తిండి లేకుండా ఉంటున్న వారికి మీ హామీ బరోసా ఏది సియం.గారూ.. అంటే కుప్పం నియోజక వర్గంలో ఉన్న ఓటర్లు మీకు మీ పార్టీకి ఓట్లు వేస్తేనే మీరు అధికారంలోకి వచ్చారా? మాకు ఆ నియోజకవర్గ ప్రజలపై ఎటువంటి భేషజాలు లేవు వారికి ఇవ్వడంలో తప్పు లేదు మిగిలిన నియోజక వర్గ ప్రజలు చేసుకున్న పాపం ఏమిటి ఎందుకు ఇంత స్వార్థం


Government of Andhra Pradesh

CERTIFICATE FOR PERSON WITH DISABILITY

(Issued under the authority vide G.O.Ms.No.35 HEALTH, MEDICAL AND FAMILY WELFARE (A) DEPARTMENT dt.10.04.2018 )

Medical Board: Area Hospital, Palamaner

ID No.of Person with Disability: 10620200104000151

Date of Issue: 01/08/2025

- This is certified that Smt K Ramani, W/o K Shankarappa, Female, age 58 years, resident of H.No.#7-420-3, Dhanapuram Habitation, V.kota Village, VENKATAGIRI KOTA Mandal, Chittoor District, is suffering from Permanent disability of the following category:- Physical(Locomotor/Orthopaedic) Disability.
  The disability is in relation to her : Bilateral Lower Limb. Impaired reach.
- Sub-type of disability :Post Traumatic Sequel-Limbs.
  Cause of Disability : Accident. Re-assessment of this case is not recommended.
- Percentage of disability in her case is 78% [Seventy Eight percent]. She meets the following physical requirements for discharge of her duties. F-can perform work by manipulating with fingers,PP-can perform work by pulling and pushing,L-can perform work by lifting,S-can perform work by sitting.
- Identification Marks of Person with Disability:-
  a)A MOLE ON LEFT THIGH.
  b)A MOLE RIGHT THIGH.

| Signature | Signature | Signature |
|---|---|---|
| Dr.P.Thej Sandeep Raj | Dr.M.Ramamoorthy Naik | Dr.K.Mamtha rani |
| MBBBS, D Ortho | MS (GS) | MBBS,DCH |
| Civil Assistant Surgeon | Civil Surgeon Specialist | Chairman, Medical Board |
| Regn.No : 87026 | Regn.No : 19358 | Regn.No : 40439 |

Signature Not Verified
Digitally signed by MAMATHA RANI KANDRAKOTA
Date: 2025.08.01 11:34:02 IST

అంటే వచ్చే ఎన్నికలలో విజయం సాధించలేరా? ప్రభుత్వం వచ్చి 20 నెలలు గడిచిన ఒక్క పింఛన్ మంజూరు చేసిన పాపాన పోలేదు.

పింఛన్లు మంజూరు చేసి సీఎం మాట నిలబెట్టుకోవాలి

అర్హులైన వికలాంగులు వృద్ధులు వితంతువులు ఒంటరి మహిళలు సచివాలయాలకు ప్రదక్షణ చేస్తున్నారు పింఛను మంజూరు చేయండి మహాప్రభు అంటూ వేడుకుంటున్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఇప్పుడు అవకాశం లేదు,ప్రభుత్వం పింఛన్ల వెబ్సైట్ ఓపెన్ చేయలేదు మేమేమీ చేయలేమంటూ అధికారులు చేతులెత్తేస్తున్నారు. 20నెలలుగా పింఛన్ల కోసం అర్హులు ఎదురు చూస్తున్నారు.ఇచ్చిన మాట నిలబెట్టు కోవాలని నిలదీస్తున్నారు. అయితే కుప్పం నియోజకవర్గంలో మాత్రం కొత్త పింఛన్లు, వ్యవసాయశాఖ ద్వారా రైతులకు థార్పాల్ పట్టలు మంజూరు చేశారు.మిగతా రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గ ప్రజలకు ఎక్కడా కొత్త పింఛన్లు కానీ,రైతులకు టార్పాలిన్ పట్టలను మంజూరు చేయకపోవడాన్ని ప్రజలు తప్పు పడుతున్నారు. మాపై ఎందుకు వివక్ష చూపుతున్నారంటూ నిలదీస్తున్నారు.మేము ఆంధ్ర రాష్ట్రంలో లేమా కుప్పానికే ప్రత్యేకత ఏమిటని ప్రశ్నిస్తున్నారు.వివక్ష చూపడం తగదని హితవు పలుకుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాటను ఇప్పటికైనా నెరవేర్చాలని ఇక్కడి నియోజకవర్గ ప్రజలతో బాటు రాష్ట్రంలోని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# వి.కోటలో గ్యాస్ డెలివరీ బాయ్స్ అక్రమ వసూళ్లు

## సిలిండర్ పై రూ.30 నుంచి 50 అదనంగా డిమాండ్
## చూసిచూడనట్లు వ్యవహరిస్తున్న ఏజెన్సీలు, అధికారులు





పలమనేరు,పెన్ పవర్, మార్చి 07, నియోజకవర్గ పరిధిలోని వి.కోట పట్టణంలో గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ల సరఫరాలో అక్రమ వసూళ్లు విస్తృతంగా జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సిలిండర్ ధరలోనే డెలివరీ ఛార్జీలు కలిపి ఉన్నప్పటికీ,డెలివరీ బాయ్స్ అదనంగా రూ. 30 నుంచి 50 వరకు వసూలు చేస్తున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా మధ్యతరగతి,పేద కుటుంబాలపై ఈ అదనపు భారంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సంబంధిత గ్యాస్ ఏజెన్సీలకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోక పోవడంతో ఈ అక్రమ దందా మరింత పెరుగుతోందని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఒకవేళ ఎవరైనా ఫిర్యాదు చేస్తే తదుపరి సిలిండర్ విషయంలో వినియోగదారులను ఇబ్బంది పెడుతున్నారు. వినియోగదారులు ఇంట్లో లేరని,అడ్రస్సు దొరకలేదని,ఇంటికి తాళం వేశారని గ్యాస్ సిలిండర్ను రిటర్న్ చేస్తున్నారు.దీంతో వినియోగదారులు సిలిండర్ను మరో నెల తరువాత మళ్లీ బుక్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.50 రూపాయలే కదా అని పలువురు ఫిర్యాదు చేయడానికి కూడా ముందుకు రావడం లేదు.వి.కోట పట్టణంలో ఇండేన్ గ్యాస్ వంటి ప్రభుత్వ అనుబంధ సంస్థల గ్యాస్ ఏజెన్సీ పనిచేస్తున్నాయి. పట్టణంలో సుమారు 1.20 లక్షల నుంచి 1.50 లక్షల వరకు గ్యాస్ కనెక్షన్లు ఉన్నట్లు అంచనా.ప్రతి రోజు వందల సంఖ్యలో గ్యాస్ సిలిండర్లు గృహాలకు సరఫరా అవుతున్నాయి. అయితే డెలివరీ సమయంలో గ్యాస్ బాయ్స్ అధికారిక బిల్లు ధరకు అదనంగా నగదు డిమాండ్ చేస్తున్నారని పలువురు వినియోగదారులు చెబుతున్నారు.గ్యాస్ సరఫరా నిబంధనల ప్రకారం,ఏజెన్సీ పరిధిలో 5 కిలోమీటర్ల లోపు ఉన్న వినియోగదారులకు హోమ్ డెలివరీ పూర్తిగా ఉచితం. వినియోగదారుడు చెల్లించే సిలిండర్ బిల్లులోనే డెలివరీ ఛార్జీలు కలిపి ఉంటాయి.అందువల్ల అదనంగా ఒక్క రూపాయి కూడా వసూలు చేయడం చట్టవిరుద్ధం.కానీ ఏజెన్సీల వద్ద కొంతమంది దళారులు ఇక్కడి ఓగ్యాస్ ఏజెన్సీతో కుమ్మక్కై మొదట హోటల్ వాళ్లకు సరఫరా చేస్తుంటారు . ఒకవేళ ఏజెన్సీ నుంచి దూరం ఎక్కువగా ఉంటే మాత్రమే ప్రభుత్వం నిర్ణయించిన స్వల్ప కాన్వేయన్స్ ఛార్జీలు ఉండవచ్చు.అవి కూడా బిల్లులో స్పష్టంగా ముద్రించి ఉంటేనే చెల్లించాల్సి 919 రూపాయలు తీసుకోవాల్సి ఉంటుంది.అంతే కాకుండా వి.కోట పట్టణ పరిధిలో ఒక్క రూపాయి కూడా తీసుకోకూడదు అనే నిబంధనలు ఉన్నాయి. మేముఐదు కిలోమీటర్ల నుంచి 15 కిలోమీటర్ల వరకు 20 నుంచి 30 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. అయితే వి.కోటలో పరిస్థితి దీనికి పూర్తి విరుద్ధంగా ఉందని వినియోగదారులు చెబుతున్నారు.గ్యాస్ బాయ్స్ అంతస్తుల వారీగా వేర్వేరు రేట్లు నిర్ణయించి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.గ్రౌండ్ ఫ్లోర్కు ఒక రేటు, మొదటి అంతస్తుకు మరో రేటు,రెండో లేదా మూడో అంతస్తుకు ఇంకా ఎక్కువ రేటు పేరుతో అదనంగా డబ్బులు తీసుకుంటున్నారని సమాచారం. సిలిండర్ను ఇంటి గుమ్మం వరకు చేర్చడం డెలివరీ సిబ్బంది బాధ్యత అయినప్పటికీ, ఈ పేరుతో అక్రమ వసూళ్లు కొనసాగు తున్నాయని వినియోగదారులు అంటున్నారు.

ముఖ్యంగా ఆన్లైన్ ద్వారా ముందుగానే సిలిండర్ డబ్బులు చెల్లించినా కూడా డెలివరీ సమయంలో నగదు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. ఇవ్వకపోతే సిలిండర్ ఇవ్వకుండా తిరిగి తీసుకెళ్తారనే భయం ప్రజల్లో నెలకొంది. తదుపరి సారి సిలిండర్ సరఫరా చేయరేమో అన్న ఆందోళనతో చాలా మంది వినియోగదారులు నోరు మూసుకుని అదనపు డబ్బులు చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. ఈ విషయమై గ్యాస్ ఏజెన్సీలకు ఫిర్యాదు చేసినప్పటికీ సరైన చర్యలు తీసుకోవడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. కొందరు వినియోగదారులు ఏజెన్సీలకు ఫోన్ చేసి ఫిర్యాదు చేసినా చూస్తాం అంటూ కాలయాపన చేస్తున్నారని చెబుతున్నారు.దీంతో డెలివరీ బాయ్స్ అక్రమ వసూళ్లు నిరభ్యంతరంగా కొనసాగుతున్నాయని అంటున్నారు. వినియోగదారుల హక్కుల ప్రకారం బిల్లులో ఉన్న ధర కంటే ఎక్కువగా డబ్బులు వసూలు చేయడం నేరం.డెలివరీ సమయంలో ఇచ్చే క్యాష్ మెమోలో ఉన్న మొత్తాన్ని మాత్రమే చెల్లించాలి.అందులో లేని ఇతర ఛార్జీలను వినియోగదారులు చెల్లించాల్సిన అవసరం లేదు.ఒకవేళ డెలివరీ సిబ్బంది అదనపు డబ్బులు డిమాండ్ చేస్తే,సంబంధిత గ్యాస్ కంపెనీల టోల్ ఫ్రీ నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చు.అలాగే జిల్లా వినియోగదారుల ఫోరమ్ లేదా పౌరసరఫరాల శాఖ అధికారులను సంప్రదించే అవకాశమూ ఉంది.

ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గ్యాస్ సిలిండర్ల సరఫరాలో అదనపు డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసిన విషయం తెలిసిందే.ముఖ్యంగా దీపం పథక...

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన జిల్లా పోలీస్ శాఖ.



తిరుపతి/పెన్ పవర్/మార్చి 07 తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థినిలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమాలలో నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, మహిళలపై జరుగుతున్న నేరాలు, క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్, ఆన్లైన్ మోసాలు, సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న మోసాలపై పోలీసు అధికారులు విద్యార్థినిలకు విపులంగా అవగాహన కల్పించారు. అదేవిధంగా అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించుకోవాల్సిన హెల్ప్లైన్ నంబర్లు, పోలీస్ సహాయం పొందే విధానం గురించి కూడా వివరించారు. కార్యక్రమం సందర్భంగా విద్యార్థినిలలో ఆత్మవిశ్వాసం, మానసిక స్థైర్యం పెంపొందించేందుకు ఆటలు, పోటీలు నిర్వహించడంతో పాటు వారికి ప్రోత్సాహకరంగా సందేశాలు అందించారు. మహిళల భద్రత, స్వీయరక్షణపై అవగాహన కలిగి ధైర్యంగా ముందుకు సాగాలని పోలీసు అధికారులు సూచించారు. ఈ కార్యక్రమాలు విద్యార్థినిలలో చైతన్యం పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషించాయని పోలీస్ అధికారులు తెలిపారు.

01

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# సివిల్స్ లో 360వ ర్యాంకుతో సత్తాచాటిన రాయలం జయశ్రీ



పలమనేరు,పెన్ పవర్, మార్చి 07, పలమనేరు రూరల్ మండలం జరవారిపల్లి గ్రామానికి చెందిన మనెమ్మ, శ్రీరాములురెడ్డి కుమార్తె జయశ్రీ ఆల్ ఇండియా సివిల్స్ నందు 360 ర్యాంకు సాధించి తమసత్తా చాటారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని క్లాక్ టవర్ వద్దకు జయశ్రీ చేరుకోగానే కుటుంబీకులు బంధువులు బాణసంచా కాల్చి సంబరాలు జరిపి స్వీట్లు పంచిపెట్టారు.అనంతరం ఆమె శ్రీసత్య గంగమ్మగుడిలోని అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు తీర్చుకొన్నారు.అనంతరం సిఐ మోహన్ రెడ్డి,మరియు ఎస్ఐ స్వర్ణతేజ సివిల్స్ ర్యాంకర్ జయశ్రీని దుశ్శాలువ కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సివిల్స్ ర్యాంకర్ జయశ్రీ మాట్లాడుతూ... జరావారిపల్లిలో జన్మించిన తాను పదవ తరగతి వరకు ఎలినా బెటినీ ఇంగ్లీష్ మీడియం ప్రైవేట్ స్కూల్,ఇంటర్మీడియట్ సాయి శ్రీ చైతన్య,బీటెక్ జేఎన్టీయూ పులివెందులలో చదివానన్నారు.సివిల్స్ కు ఆన్లైన్ క్లాసుల ద్వారా ప్రిపరేషన్ కావడం జరిగింది, మూడవసారి 360 ర్యాంకు సాధించడం చాలా ఆనందం కలిగించిందన్నారు. ఈ విజయానికి తన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మరియు కుటుంబ సభ్యులు బంధుమిత్రులు సహకారం మరువలేనిదన్నారు. మార్చి 8న మహిళా దినోత్సవం కావడంతో వారికి ఎలాంటి సందేశం ఇవ్వనున్నారని పాత్రికేయులు ప్రశ్నించగా,ఆత్మ విశ్వాసంతో మహిళలను వారిని వారిలా ఉండనిస్తే చాలనీ,అలా తన కుటుంభం నన్ను పెంచారు కాబట్టే ఈరోజు మంచి ర్యాంక్ సాధించడానికి అవకాశం వచ్చిందని అన్నారు.ఈసందర్భంగా పట్టణానికి చెందిన పలువురు ఆమెను అభినందనలతో ముంచెత్తారు.

# 700 బస్తాల రేషన్ బియ్యం సీజ్



కావలి (నెల్లూరు) : పెన్ పవర్, మార్చి, 07: కావలి ముద్దురుపాడు సమీపంలోని శ్రీ లక్ష్మీ నరసింహ ట్రేడర్స్ రైస్ మిల్లుపై విజిలెన్స్ అధికారులు శనివారం ఆకస్మిక దాడి చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 700 బస్తాల (350 క్వింటాళ్లు) రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన బియ్యం విలువ దాదాపు రూ.10 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. విజిలెన్స్ సీఐ శ్రీహరిరావు ఆధ్వర్యంలో పక్కా సమాచారంతో ఈ తనిఖీలు నిర్వహించామని అధికారులు తెలిపారు.

# జామియా మస్జిద్ యూత్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు





గూడూరు, పెన్ పవర్, మార్చి,07: పవిత్ర రమజాన్ మాసాన్ని పురస్కరించుకుని గూడూరు పట్టణంలోని జామియా మస్జిద్లోజామియామస్జిద్యూత్ఆధ్వర్యంలోముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రోజంతా ఉపవాసంఉన్న ముస్లిం సోదరులు సాయంత్రం మగ్రిబ్ నమాజ్కు ముందు కలిసి ఇఫ్తార్ చేశారు.ఈ సందర్భంగా మస్జిద్ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణంనెలకొంది.ఈ కార్యక్రమం లో యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉపవాసం విరమించి పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. రమజాన్ మాసం శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు.జామియా మస్జిద్ యూత్ సభ్యులు ఈ ఇఫ్తార్ విందును సమిష్టిగా నిర్వహించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

# విజిబుల్ పోలీసింగ్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా గ్రామాలలో అవగాహన కార్యక్రమం.








తిరుపతి/పెన్ పవర్/మార్చి 07 తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు విజిబుల్ పోలీసింగ్లో భాగంగా ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమవుతూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్ల పరిధిలోని గ్రామాన్ని పోలీస్ అధికారులు సందర్శించి యువతకు మరియు గ్రామ పెద్దలకు రోడ్డు భద్రత నియమాలు, సైబర్ నేరాలు, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే హానికర ప్రభావాలు మరియు వాటి పరిణామాల గురించి వివరంగా అవగాహన కల్పించారు. అదేవిధంగా అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించుకునే Shakti App ప్రాముఖ్యత, Dial 112 అత్యవసర సేవల వినియోగంపై కూడా ప్రజలకు తెలియజేశారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని అధికారులు తెలిపారు.

# అంతా ఫీల్ గుడ్ కాదా..

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

**విజయవాడ, మార్చి 7, పెన్ పవర్:** కృష్ణా జిల్లా తిరువూరు నియోజకవర్గంలో గత కొంతకాలంగా సాగుతున్న రాజకీయ వివాదాలకు ఎట్టకేలకు తెరపడింది. కొలికపూడితో మంతెన సత్యనారాయణ రాజు భేటీ అయి, పార్టీలో దీనిపై ఉన్న సీరియస్ నెస్, రాజకీయంగా కలిగే నష్టాలను చర్చించారు. ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కొలికపూడి మధ్య కొనసాగుతున్న వివాదాన్ని పరిష్కరించారు. అనంతరం ఈ వివాదాలపై తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు స్పందించారు. తిరువూరులో నియోజకవర్గంలో నెలకొన్న విభేదాలన్నీ ముగిసినట్లేనని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన పరిణామాలు పార్టీ ప్రతిష్టకు ఏవైనా ఇబ్బందులు కలిగించి ఉంటే తాను చింతిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు మళ్లీ రిపీట్ కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు.అధికార ప్రోటోకాల్, పరస్పర గౌరవం గురించి మాట్లాడుతూ.. తన నియోజకవర్గంలో ఎంపీకి ఇవ్వాల్సిన గౌరవాన్ని ఖచ్చితంగా ఇస్తానని, అదే సమయంలో ఆయన నుంచి కూడా తాను అదే గౌరవాన్ని ఆశిస్తున్నానని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాజకీయ ప్రయోజనాల కోసం కులం కార్డును వాడటం తన అభిమతం కాదని, అందరినీ కలుపుకుని ముందుకు వెళ్తానని స్పష్టం చేశారు.తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తన ప్రాణాలకు ముప్పు ఉందని గురువారం ఆరోపించారు. నెమలి శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ కళ్యాణోత్సవం సందర్భంగా జరిగిన ఘటనను ఉటంకిస్తూ, తనపై దాడి చేసి చంపేందుకు పక్కా ప్రణాళిక జరిగిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎంపీ కార్యాలయం నుంచే మధ్యాహ్నం నుండి జనాన్ని సమీకరించాలని ఆదేశాలు వెళ్లాయని, తనను లక్ష్యంగా చేసుకుని ఈ కుట్ర పన్నారని చేసిన వ్యాఖ్యలపై టీడీపీ అధిష్టానం స్పందించింది. ఇది వ్యక్తిగతంగానే కాదు, పార్టీకి నష్టం కలిగిస్తుందని.. విభేదాలు మంచిది కాదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.రక్షణ కల్పించాల్సిన పోలీసు యంత్రాంగం తీరుపై కూడా ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిఘా వర్గాల ద్వారా తన గన్ మెన్‌కు ముందస్తు హెచ్చరికలు అందినప్పటికీ, తనకు కనీసం ఒక అదనపు కానిస్టేబుల్‌ను కూడా భద్రతగా కేటాయించలేదని ఆయన ప్రశ్నించారు. నెమలి వేణుగోపాల స్వామి ఆలయ కళ్యాణం సమయంలో కరెంట్ తీసివేసి చీకట్లో తనపై దాడి చేయాలని ప్లాన్ చేశారని, అయితే పోలీసులు అందుకు నిరాకరించడం వల్ల ప్రమాదం తప్పిందని తనకు సమాచారం ఉందని ఆయన వెల్లడించారు.తన కారు అద్దాలు పగలగొట్టి, టైర్ల గాలి తీసి తనను అడ్డుకుని భౌతిక దాడి చేయాలని చూశారనే స్పష్టమైన ఆధారాలు తన వద్ద ఉన్నాయని కొలికపూడి శ్రీనివాసరావు మీడియాతో చెప్పారు. ఒక అధికార పార్టీ ఎమ్మెల్యే అయ్యుండి కూడా తనకు భద్రత కల్పించడంలో వైఫల్యం చెందడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిణామాలు తిరువూరు నియోజకవర్గంలో రాజకీయ ఉత్కంఠను మరింత పెంచాయి.

## విజయవాడ విద్యాధరాపురం లో దారుణం

### మూడు సంవత్సరాల పాప పై యాసిడ్ పోసిన స్కూల్ టీచర్

### ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

**విజయవాడ: పెన్ పవర్:** విజయవాడ విద్యాదారపురం నేషనల్ ప్లే స్కూల్ లో టీచర్ చేసిన నిర్వాకం ఆలస్యంగా బయటపడింది. ఫిబ్రవరి 23 వ తారీకు పాపను నేషనల్ స్కూల్ దగ్గరపాపను తల్లీ దింపింది. కాసేపటికి స్కూల్ నుంచి పాప బాతురూమ్ లో పడిపోయింది అని తల్లి కి ఫోన్ వచ్చింది. వెంటనే పాప తల్లీ, అక్క స్కూల్ కి వచ్చి ఏడుస్తూ ఉన్న పాపని హాస్పిటల్ కి తీసుకువెళ్లారు . పాపను హాస్పిటల్ కు తీసుకువెళ్తే నిజాలు బయటపడ్డాయి. తల్లిదండ్రులు స్కూల్ దగ్గర కు వెళ్లి స్కూల్ యజమానాన్ని గట్టిగా అడుగగా నిజం స్కూల్ యాజమాన్యం ఒప్పుకుంది. హాస్పిటల్ లో బిల్లు కట్టి చేతులు దులుకుకుంది. తరువాత కొంత డబ్బులు ఇచ్చి రాజీకి రమ్మని స్కూల్ యాజమాన్యం చెప్పింది. తల్లిదండ్రులు ఒప్పుకోవకపోవడం తో బెదిరింపులకు దిగింది. ఈ విషయాలు బయటకు చెప్తే మీ అంతుచుస్తాను అంటూ ప్రిన్సిపాల్ తల్లిదండ్రులకు వార్నింగ్ ఇచ్చారు. డీసీపీ తమ చుట్టం అంటూ తల్లిదండ్రులకు బెదిరించారు. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న తమ కూతురిపై ఇంత కూరాత్మకంగా గాయపరిచిన వారిని శిక్షించాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

## గ్యాస్ ధరల పెంపు

**న్యూఢిల్లీ: పెన్ పవర్:** అమెరికా ఇరాన్ యుద్ధం ప్రభావం మన దేశంపై ప్రభావం గట్టిగానే పడుతోంది. అంతర్జాతీయంగా ముడిచమురు రవాణాకు ఆటంకం ఏర్పాడిన నేపథ్యంలో దేశంలో చమురు ధరల పెంచక తప్పని పరిస్థితి ఏర్పడింది.. ఈ నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ ధరలు పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. తక్షణం కొత్త రెట్లు అమలులోకి రానున్నాయి. కమర్షియల్ సిలిండర్ ధర రూ.115, వంట గ్యాస్ ధర రూ.60 పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం ప్రకటించింది. హైదరాబాద్ లో వంటగ్యాస్ సిలిండర్ ధర పెంపు తర్వాత రూ.965 గా ఉంటుంది. ఉజ్వల స్కీమ్ సిలిండర్ ధర విషయంలో ఎలాంటి మార్పు ఉండదని కేంద్రం తెలిపింది. పెట్రోల్ డీజిల్ ఇతర గ్యాస్ ధరలు కూడా పెరిగే అవకాశముంది.. దేశంలో చమురు నిల్వలు ఇరవై రోజుల్లో అడుగంటే పరిస్థితి ఉందని సమాచారం.

## కమలం చేతికి బీహార్..

**పాట్నా, మార్చి 7, పెన్ పవర్:** బిహార్‌లో రాత్రికి రాత్రి రాజకీయం మారిపోయింది. పదిసార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకరారం చేసి 21 ఏళ్లుగా బిహార్‌కు దశ దిశ నిర్దేశించిన నితీశ్‌కుమార్ రాజకీయం రాష్ట్రంలో ముగిసింది. రాజ్యసభకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. మార్చి 5న నామినేషన్ వేశారు. నితీశ్‌కుమార్ ఢిల్లీ రాజకీయాలకు వెళ్లనున్నారు. దీంతో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎవరు అన్న చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రిగా ఆయన పూర్తికాలం ఉంటారని ఎన్నికల సమయంలో ప్రచారం చేశారు. కానీ 5వ తేదీన నితీశ్‌కుమార్ ట్విట్టర్‌లో ఒక పోస్టు పెట్టారు. రాజ్యసభకు నామినేసన్ వేస్తున్నట్లు పేర్కొన్నారు.మార్చి 4న వన్ ఆన్ మాల్ భవనంలో జరిగిన కీలక సమావేశం నితీశ్ నిర్ణయానికి మూలం. కేంద్ర మంత్రులు సంజయ్ ఝా, రామ్‌నాథ్ ఠాకూర్, విజయ్ కుమార్ చౌహాన్, బిజేంద్ర యాదవ్ పాల్గొన్నారు; అమిత్ షా ఫోన్‌లో చేరి ఆరోగ్యం, పరిపాలనా సవాళ్లపై చర్చించారు. ఇటీవల ఆయన వ్యవహార శైలి మార్పు, మతి సమస్యల ప్రచారం, ఐఏఎస్ అధికారుల ప్రభావం ప్రజల్లో అసంతృప్తి తెచ్చాయి. మార్చి 5న ఎక్స్ పోస్ట్‌లో రాజ్యసభ ప్రయాణాన్ని ప్రకటించారు.నితీశ్ కుమారుడు 40 ఏళ్ల ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ నిశాంత్ కుమార్‌ను ఉపముఖ్యమంత్రిగా చేసి పార్టీ ఐక్యత కాపాడాలని జేడీయూ వర్గాలు భావిస్తున్నాయి. రాజకీయ అనుభవం లేనప్పటికీ, తండ్రి వెంట తిరుగుతూ క్రమంగా ప్రజాధరణ సంపాదించాలని ప్రణాళిక. కుటుంబ పాలనకు వ్యతిరేకత ఉన్నా, పార్టీ స్థిరత్వం కోసం ఈ దీర్ఘకాల ప్రణాళిక రూపొందుతోంది. జేడీయూ శ్రేణులు నిశాంత్ ప్రజాధరణ లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.ఇక బీజేపీ ఖాతాలో మరో రాష్ట్రం రాబోతోంది. ప్రస్తుత ఉపముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి (నితీశ్ సమాజిక వర్గనేత), నిత్యానంద రాయ్ యాదవ్, దిలీప్ సైస్వాల్, విజయ్ కుమార్ సిన్హా సీఎం అవకాశాల్లో ముందున్నారు. బీజేపీ ఆధారంతో జేడీయూ మద్దతు ప్రభుత్వ ఏర్పాటుకు దారితీస్తుంది. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ఇది నితీశ్ స్వచ్ఛంద నిర్ణయమని, భవిష్యత్ ప్రభుత్వానికి ఆయన మార్గదర్శకత్వం ఉంటుందని తెలిపారు. రాజ్యసభ స్థానం జేడీయూ ప్రభావాన్ని కొనసాగిస్తుందని ఆశ.అసెంబ్లీలో 249 స్థానాల్లో బీజేపీ 89, జేడీయూ 86, రామ్ విలాస్ పాశ్వాన్ పార్టీ 19, ఆర్ఎల్‌జేపీ 4 సాధించాయి. ఆర్ఎల్‌జేపీ బీజేపీలో విలీనం ప్రణాళిక ఆర్‌జేడీ చీల్చే అవకాశాన్ని అడ్డుకుంటుంది. ఈ మలుపుతో బీజేపీ మరో రాష్ట్రంలో సీఎం పదవి సాధించనుంది. రోహిణి ఆచార్యలు నితీశ్‌ను బీజేపీ 'కీలుబొమ్మ'గా విమర్శిస్తూ, మిత్రద్రోహానికి మూల్యం చెల్లించారని ఆరోపించారు. ఈ పరిణామం బీజేపీ బలోపేతానికి జేడీయూ బలహీనతకు దారితీస్తోంది.

## 14 దేశాలకు పాకిన యుద్ధం

**న్యూయార్క్, మార్చి 7, పెన్ పవర్:** మిడిల్ ఈస్ట్‌లో అమెరికా పెట్టిన చిచ్చు క్రమంగా రగులుతోంది. మొదట ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ దాడులతో యుద్ధమ మొదలైంది. తొలిరోజే ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని అమెరికా మట్టుబెట్టడంతో ఇరాన్ ప్రతీకార దాడులు ప్రారంభించింది. అయితే ఈ దాడులు ఇజ్రాయెల్‌తోపాటు అమెరికా బేస్‌లు ఉన్న గల్ఫ్ దేశాలపై వైమానికి దాడులు చేసింది. సౌదీ అరేబియా, దుబాయ్, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్, ఓమన్, టర్కీ తదితర దేశాలపై ఇరాన్ మిస్సైల్ దాడులు చేస్తోంది. యుద్ధం ప్రారంభించి ఏడు రోజులైంది. మూడు దేశాలతో మొదలైన యుద్ధం ఇప్పుడు 14 దేశాలకు విస్తరించింది. ఇప్పుడు ఇరాక్, కువైట్, యూఏఈ, బహ్రెయిన్, ఖతర్, జోర్డాన్, అజర్‌బైజాన్, ఒమాన్, సౌదీ అరేబియా, లెబనాన్, సైప్రస్ వంటి 14 దేశాలను యుద్ధం చుట్టుముట్టింది.చర్చలు లేకపోవడంతో యుద్ధం ఇప్పట్లో ముగిసే సూచనలు కనిపించడం లేదు. రష్యాఉక్రెయిన్ యుద్ధంలాగా ఈ ఘర్షణ కూడా సంవత్సరాలు పట్టే అవకాశం కనిపిస్తోంది. ఇరాన్ యుద్ధం విస్తరించేందుకు అమెరికా అనుకూల దేశాలపై దాడులు చేస్తుంది. మరోవైపు అమెరికాఇజ్రాయెల్ ఇరాన్‌ను వీలైనంత త్వరగా కట్టడికి ప్రయత్నిస్తున్నాయి. ఇరాన్‌కు ప్రాక్సీ దళాలు (హిజ్బుల్లా, హౌతీలు) దీర్ఘకాల పోరాటానికి అనుకూలం. అమెరికా, ఇజ్రాయెల్ ఆధునిక ఆయుధాలతో పైచేయి సాధిస్తున్నా, ప్రాంతీయ మద్దతు బలహీనత కలిగిస్తోంది. చైనా కూడా ఇరాన్ సార్వభౌమాధికారం కాపాడతామని ప్రకటించింది. దీంతో చైనా కూడా యుద్ధ రంగంలోకి దిగే అవకాశాలు ఉత్కంఠ రేపుతున్నాయి.ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తున్న రష్యా, వాణిజ్య భాగస్వామి చైనా రంగంలోకి దిగితే పరిస్థితి ప్రపంచ యుద్ధ స్థాయికి చేరుకుంటుంది. రష్యా డ్రోన్‌లు, మిస్సైల్ సాంకేతికత ఇచ్చి ఉక్రెయిన్ మోడల్‌ను పునరావృతం చేయవచ్చు. చైనా ఆర్థిక ఒత్తిడి, ఓసియాన్ మార్గాల్లో జోక్యం చేస్తే అమెరికా శక్తి విభజన అవుతుంది. ఇది నాటో, అరబ్ మిత్రుల మధ్య వైరుధ్యాలను పెంచుతుంది.తక్షణ శాంతి ఒప్పందాలు లేకపోతే యుద్ధం రెండేళ్లు కొనసాగవచ్చు. ఐరోపా, ఐక్యరాష్ట్ర సమితి మధ్యవర్తిత్వం జరిగితే మాత్రమే మొదటి దశలో ఆగిపోతుంది. ఆర్థిక సంక్షోభాలు, ఆంతరిక అశాంతి ద్వారా కూడా యుద్ధం ఆగే అవకాశం ఉంది. అయితే, ప్రాంతీయ అస్థిరత భవిష్యత్ దశాబ్దాల్లో కొనసాగుతుంది.

# ఏపీ లిక్కర్ స్కామ్

### 3500 కోట్ల నష్టం..440 కోట్ల జప్తు



**విజయవాడ, మార్చి 7, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో రూ.441.63 కోట్ల విలువైన చర, స్థిర ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జప్తు చేసింది. కేశిరెడ్డి రాజశేఖర రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, అనుబంధ సంస్థలు, బూనేటి చాణక్య, వాసుదేవ రెడ్డి బంధువులు, ఇతర వ్యక్తులు, సంస్థలకు చెందిన ఆస్తులను మనీలాండరింగ్ నిరోధక చట్టం (ప్రకారం స్వాధీనం చేసుకుంది. జప్తు చేసిన ఆస్తుల్లో బ్యాంకు నిల్వలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, భూములు, ఇతర స్థిరాస్తులు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా రాష్ట్ర సీఐడీ నమోదు చేసిన కేసును ఆధారంగా చేసుకుని ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. మద్యం విధానంలో అవకతవకల వల్ల ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.4,000 కోట్ల నష్టం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.2019కి ముందు రాష్ట్రంలో మద్యం వ్యాపారం పారదర్శకంగా, సాఫ్ట్‌వేర్ ఆధారిత వ్యవస్థ ద్వారా నడిచేది. కొనుగోలు నుంచి విక్రయాల వరకు ప్రతి దశను డిజిటల్‌గా నమోదు చేసేవారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం రిటైల్ మద్యం దుకాణాలను ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకువచ్చి ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించింది. ఈ సమయంలో ఆటోమేటెడ్ వ్యవస్థను నిలిపివేసి మాన్యువల్ విధానాన్ని అమలు చేసినట్టు దర్యాప్తులో బయటపడిందని పేర్కొంది. దీంతో సరఫరా ఆర్డర్లు జారీ చేసే విషయంలో అధికారులకు విస్తృత స్వేచ్ఛ లభించిందని ఈడీ తెలిపింది.మాన్యువల్ విధానాన్ని ఉపయోగించి మార్కెట్‌లో ఉన్న కొన్ని ప్రముఖ మద్యం బ్రాండ్లను పక్కన పెట్టారని దర్యాప్తులో తేలింది. అదే సమయంలో కొందరు ఇష్టమైన బ్రాండ్లకు అధిక ప్రాధాన్యం ఇచ్చి సరఫరా ఆర్డర్లు మంజూరు చేసినట్టు వెల్లడైంది. అదే పేర్లతో పోలి ఉండే కొత్త బ్రాండ్లను ప్రవేశపెట్టి వాటి ధరలను కృత్రిమంగా పెంచారని ఈడీ పేర్కొంది. దీంతో డిస్టిలరీలకు అధిక లాభాలు వచ్చి అవి లంచాల రూపంలో తిరిగి సిండికేట్ సభ్యులకు చేరినట్టు వెల్లడయింది.సరఫరా ఆర్డర్లు పొందేందుకు డిస్టిలరీలు ఒక్కో కేసు ధరలో 15 నుంచి 20 శాతం వరకు కిక్‌బ్యాక్‌లు చెల్లించాల్సి వచ్చిందని దర్యాప్తులో తేలింది. చెల్లించేందుకు నిరాకరించిన తయారీదారులపై ఒత్తిడి తెచ్చి చెల్లింపులు నిలిపివేయడం, ఆర్డర్లు తిరస్కరించడం వంటి చర్యలు తీసుకున్నట్టు వెల్లడైంది. ఈ వ్యవహారాలకు సంబంధించిన సమాచారాన్ని దాచేందుకు ఎన్‌క్రిప్టెడ్ వాయిస్ కాల్స్, సిగ్నల్ వంటి యాప్‌లను ఉపయోగించినట్టు ఈడీ తెలిపింది. ఇందులో బూనేటి చాణక్య , ముప్పిడి అవినాష్ అలియాస్ సుమిత్, మహ్మద్ సైఫ్ వంటి వారు కీలక పాత్ర పోషించినట్టు పేర్కొంది.కేశిరెడ్డి రాజశేఖర రెడ్డి నేతృత్వంలోని సిండికేట్ రాష్ట్రంలో మద్యం కొనుగోలుపంపిణీ వ్యవస్థను ప్రభావితం చేసి బహుకోట్ల కుంభకోణం నిర్వహించినట్టు ఈడీ పేర్కొంది. ఇూాదీజూ కొనుగోలు ప్రక్రియలో జోక్యం చేసి రాష్ట్ర ఖజానాకు సుమారు రూ.3,500 కోట్ల నష్టం కలిగించినట్టు దర్యాప్తులో తేలింది. సిండికేట్ సభ్యులు కిక్‌బ్యాక్‌ల రూపంలో సుమారు రూ.3,500 కోట్ల వరకు వసూలు చేసినట్టు గుర్తించింది.కొన్ని డిస్టిలరీలను నియంత్రణలోకి తీసుకుని వాటి ద్వారా అక్రమ ఆదాయం సృష్టించినట్టు ఈడీ తెలిపింది. అదాన్ డిస్టిలరీ ప్రైవేట్ లిమిటెడ్, లీలా డిస్టిలరీలు, యూ.వి. డిస్టిలరీలు వంటి సంస్థలకు అధిక వ్యాపారం కల్పించినట్టు పేర్కొంది. మద్యం రవాణా టెండర్‌ను సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించి గతంతో పోలిస్తే ఎక్కువ ధరలు చెల్లించినట్టు కూడా వెల్లడించింది. ఆ కాంట్రాక్టు ఆదాయంలో కొంత భాగాన్ని ఇతర సంస్థల ద్వారా మనీలాండరింగ్ చేసినట్టు గుర్తించింది.కొన్ని డిస్టిలరీలు ముడిసరుకు, ప్యాకేజింగ్ సరఫరా పేరుతో కల్పిత కంపెనీలను ఉపయోగించి నిధులను నగదుగా మార్చినట్టు ఈడీ తెలిపింది. ఈ అక్రమ నిధులను భూములు కొనుగోలు చేయడం, రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు చేపట్టడం వంటి మార్గాల్లో పెట్టుబడిగా మార్చినట్టు వెల్లడించింది. ఇందుకోసం ఈశాన్వి ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, ఈడి ఎంటర్‌టైన్‌మెంట్, యూని కార్పొరేట్ సొల్యూషన్స్, ట్యాగ్ డెవలపర్స్ వంటి సంస్థలను వినియోగించినట్టు తెలిపింది.కొనుగోలు, సరఫరా విధానాలను ప్రభావితం చేసి సిండికేట్ నెలకు సుమారు రూ.100 కోట్ల వరకు అక్రమ ఆదాయం పొందినట్టు దర్యాప్తులో తేలింది. ఈ నగదు కిక్‌బ్యాక్‌లను హైదరాబాద్‌లోని వివిధ ప్రదేశాల్లో నిల్వ ఉంచినట్టు కూడా గుర్తించింది.ఇప్పటివరకు దర్యాప్తులో రూ.1,048.45 కోట్ల మనీ ట్రైల్ గుర్తించినట్టు ఈడీ వెల్లడించింది. ఇందులో నగదు, బంగారం రూపంలో చెల్లించిన కిక్ బ్యాక్ లు, డిస్టిలరీల నియంత్రణ, మద్యం రవాణా ద్వారా వచ్చిన లాభాలు ఉన్నాయి.ఈ అక్రమ ఆదాయంతో ఆస్తులు కొనుగోలు చేసి వ్యక్తిగత లాభాల కోసం వినియోగించినట్టు తేలింది. కేసులో ఇంకా దర్యాప్తు కొనసాగుతోంది.

# పెళ్లిళ్లు..ఓదార్పులేనా....

**కడప, మార్చి 7, పెన్ పవర్:**
గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ ఎక్కడ ఏ చిన్న ఘటన జరిగినా వెళ్లి బాధితుల్ని పరామర్శించేవారు. కానీ ఇప్పుడు ఆయన రూట్ మారిపోయింది. ఘోర విషాదాలు జరిగినా పట్టించుకోవడం లేదు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలను ఓదార్చడానికి పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. పార్టీ నేతలు అరెస్టు అయితే యాత్రగాతో వెళ్లి పరామర్శలు చేస్తున్నారు. అదికూడా కొంత మంది కే. మిగిలిన వారిని ఇంటికి పిలిపిచుకుని ఓదారుస్తున్నారు. ఇక ప్రజాసమస్యలు.. ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే మాత్ర అసలు వెళ్లడం లేదు. ఈ నెలలో రెండు, మూడు ఘోర విషాదాలు ఏపీలో జరిగాయి. ఒకటి కల్తీ పాల విషాదం, రెండు బాణసంచా విషాదం. ఉత్తరాంధ్రలో డయోరియా వల్ల కూడా కొంతమంది చనిపోయారు. సాధారణంగా ఇలాంటివి జరిగినప్పుడుప్రతిపక్ష పార్టీలు హడావుడి చేస్తాయి. కానీ జగన్మోహన్ రెడ్డి అసలు పట్టించుకోలేదు జగన్ పరామర్శలు చేస్తారని వైసీపీ వర్గాలు అనుకున్నా.. ఈ వారం ఆయన పెళ్లిళ్లకు మాత్రమే పరిమితమయ్యారు. గత రెండేళ్లుగా జగన్ చేస్తున్నది ఇదే. వైసీపీ ఓడిపోయిన తర్వాత జగన్ రాజకీయం పూర్తిగా విజిటింగ్ ప్రొఫెసర్ తరహాలో జరుగుతోంది. వారానికి మూడు, నాలుగు రోజులు మాత్రమే తాడేపల్లిలో ఉంటున్నారు. బుధవారం వచ్చి శుక్రవారం బెంగళూరుకు వెళ్లిపోతున్నారు. ఈ సమయంలో ఓ ప్రెస్మీట్ లేకపోతే పార్టీ నేతలతో సమావేశం సందర్భంగా మాట్లాడి ఆ వీడియోలను విడుదల చేస్తున్నారు. ప్రజల్లోకి వెళ్లిన సందర్భాలు తక్కువ. ఓ సారి చిత్తూరులో మామిడి రైతులకు సంఘిభావం తెలిపేందుకు

వెళ్లారు. ఆ తర్వాత పార్టీ నేతల ఇళ్లకు పరామర్శలకే వెళ్లారు. జగన్మోహన్ రెడ్డి తన పర్యటనలను ఎక్కువగా రాజకీయ కారణాలకే పరిమితం చేస్తున్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత జగన్ వైఖరిలో స్పష్టమైన మార్పు వచ్చిందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా ప్రజలు తిరస్కరించారన్న భావనలో జగన్ ఉన్నారని .. ఆ అసంతృప్తి ఆయనలో ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది. అయితే జగన్ స్వయంగా తనకు నలభై శాతం ఓటు బ్యాంక్ ఉందని చెబుతూ ఉంటారు. ఆ కోణంలోనే ప్రజా సమస్యలపై గళమెత్తాల్సిన ప్రతిపక్ష హోదాలో ఉండి కూడా, ఆయన కేవలం ప్రెస్ నోట్లు, సోషల్ మీడియా పోస్టులకే పరిమితం కావడం పార్టీ క్యాడర్ ను అసంతృప్తికి గురి చేస్తోంది. అయితే వైసీపీ పెద్దలు మాత్రం మరో విధంగా స్పందిస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వైకాపా నాయకులపై కేసులు బనాయిస్తోందని, వారిని కాపాడుకోవడమే ప్రస్తుతానికి ప్రాధాన్యత అని జగన్ భావిస్తున్నట్లు చెబుతున్నారు. 2019లో గెలిచిన దగ్గర నుండే జగన్ జనంతో నేరుగా మమేకం అవ్వడం తగ్గించారనే విమర్శలు ఉన్నాయి. ఉన్నాయి. ఇప్పుడు ఓడిపోయిన తర్వాత కూడా

అదే ధోరణి కొనసాగించడం రాజకీయంగా ఆత్మహత్యాసదృశ్యమేనన్న అభిప్రాయం వినిపిస్తోంది. ఒకప్పుడు ఓదార్పు యాత్ర పేరుతో ఊరూరా తిరిగిన జగన్, ఇప్పుడు అదే ప్రజలు కష్టాల్లో ఉంటే వెళ్లడానికి వెనకాడుతుండటం

ఆయన ఇమేజ్‌ను దెబ్బతీస్తోంది. అయితే జగన్ మూడేళ్ల పాటు ప్రజా సమస్యలను పట్టించుకోకూడదని..చివరి రెండేళ్లు పాదయాత్ర చేస్తారు కాబట్టి అంతా కవర్ అయిపోతుదంని పార్టీ వ్యూహకర్తలు అంచనా వేస్తున్నట్లుగా తెలుస్తోంది. ప్రజలు ఆయన మూడేళ్లు ఏం చేశారన్నది మర్చిపోతారని. చివరి రెండేళ్ల పోరాటంతోనే ఓట్లేస్తారని అంటున్నారు.

# భారత్ vs న్యూజిలాండ్ మధ్య ఫైనల్ ఫైట్.. నేడు కెప్టెన్ రిటైర్మెంట్?



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్ ఫైనల్ లో న్యూజిలాండ్ జట్టుతో భారత్ తలపడనుంది. సొంతగడ్డపై, భారీ అభిమాన సందోహం మధ్య కప్పు గెలిచేందుకు టీమిండియాకు మెరుగైన అవకాశాలే ఉన్నాయని క్రీడా విశ్లేషకులు అంటున్నారు. ఈ మ్యాచ్ అయ్యాక ఇండియన్ టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అంతర్జాతీయ క్రికెట్ కి రిటైర్మెంట్ ప్రకటించే అవకాశం ఉందని జోరుగా ప్రచారం జరుగుతుంది. అయితే సూర్యకుమార్ 35 ఏళ్ల వయసు పెరిగింది, ఫామ్ తగ్గింది. కెరీర్ డైలామాలో ఉంది. కాబట్టి రిటైర్మెంట్ కి ఇది సరైన సమయమే.. వరల్డ్ కప్ గెలిచి రిటైర్మెంట్ ఇవ్వడం అనేది అతడి ఇష్టం.కాగా సూర్య కుమార్ యాదవ్ ఇప్పటి వరకు టెస్టుల్లో ఒకే మ్యాచ్ ఆడాడు.. రెండేళ్లు వన్డే జట్టులో ఆడినా.. 2023 ప్రపంచకప్ ఫైనల్లో పేలవ ప్రదర్శనతో అతడిపై వేటు పడింది. ఇక అప్పటి నుంచి టీ20లకి మాత్రమే అతడు పరిమితం అయ్యాడు. ఏడాదిన్నర కిందట వెస్టిండిస్ తో టీ20 ప్రపంచకప్ గెలిచాక.. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి ఒకేసారి టీ20 ఫార్మాట్ నుంచి తప్పుకున్నారు. రోహిత్ స్థానంలో టీ20 జట్టు పగ్గాలు అందుకున్నాడు. సూర్యకుమార్ యాదవ్. అతడి సారథ్యంలో భారత జట్టు ఒక్కటంటే ఒక్క సిరీస్ కూడా ఇప్పటి వరకు ఓడిపోకపోవడం గమనార్హం. ఇప్పుడు సొంతగడ్డపై జరుగుతున్న టీ20 పొట్టి కివీస్ తో ఫైనల్ ఆడబోతోంది. ఇందులో గెలిస్తే.. జట్టుకి ప్రపంచకప్ అందించిన కెప్టెన్ గా దిగ్గజాల జాబితాలో చేరతాడు.. టీ20 క్రికెట్ నుంచి రిటైరవ్వడానికి ఇంతకంటే మంచి ఛాన్స్ మరొకటి ఉండదు. ఒకవేళ భారత జట్టు ఫైనల్లో ఓడితే.. సూర్యకుమార్ యాదవ్ కి మరో ఛాయిస్ లేదు. అతడిపై సెలక్టర్లు వేటు వేసే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. వాళ్లకు ఛాన్స్ ఇవ్వకూడదు అనుకుంటే.. తనే స్వయంగా రిటైర్మెంట్ ప్రకటించాల్సిన
పరిస్థితి నెలకొంది. ఎందుకంటే కెప్టెన్ అయిన దగ్గర నుంచి అతడు పెద్దగా రాణించిన దాఖలాలు లేవు. కెప్టెన్ కావడానికి ముందు సూర్య 68 మ్యాచ్లో 43.33 సగటుతో 2,340 రన్స్ చేశాడు. అందులో నాలుగు సెంచరీలు ఉన్నాయి. కానీ కెప్టెన్ అయ్యాక 41 మ్యాచ్ లలో 26.62 సగటుతో 932 రన్స్ చేశాడు. ఒక్క సెంచరీ లేదు.. కెప్టెన్ కావడం వల్లే జట్టులో కొనసాగుతున్నాడు కానీ.. ఇలాంటి ప్రదర్శన చేసిన ప్లేయర్ పై వేటు పడేదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. సూర్యకుమార్ ఆధ్వర్యంలో టీమిండియా వరుసగా సిరీస్ లు గెలిచిన.. అందులో అతడి పాత్ర పెద్దగా లేదని విమర్శలు వచ్చాయి. దీంతో సూర్య నిజంగానే ఫైనల్ అనంతరం రిటైర్మెంట్ ఇస్తాడా లేదా అనేదానిపై ఉత్కంఠ కొనసాగుతుంది.

# అభిషేక్ శర్మని జట్టు నుంచి తప్పించండి.. ఫైనల్‌కి ముందు మాజీ క్రికెటర్ షాకింగ్ కామెంట్స్







**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్ మ్యాచ్‌కు ముందు టీమిండియాకు మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ కీలక సూచన చేశాడు. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో న్యూజిలాండ్‌తో జరగనున్న ఫైనల్ మ్యాచ్‌లో అభిషేక్ శర్మను ప్లేయింగ్ ఎలెవన్ నుంచి తప్పించి రింకూ సింగ్‌కు అవకాశం ఇవ్వాలని తెలిపాడు. ఈ టోర్నమెంట్‌లో అభిషేక్ ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేదని పేర్కొన్నాడు. జింబాబ్వేపై ఒక అర్ధశతకం తప్ప ఇతర మ్యాచ్‌లలో అతను పెద్దగా రాణించలేదని గుర్తు చేశాడు. బ్యాటింగ్‌లోనే కాదు, ఫీల్డింగ్‌లో కూడా అతను కొన్ని కీలక క్యాచ్‌లు వదిలేయడంతో జట్టుపై తీవ్ర ప్రభావం చూపించిందని వ్యాఖ్యానించాడు.

టీ20 వంటి చిన్న ఫార్మాట్‌లో మార్పులు చేయడం తప్పు కాదు.. వెస్టిండీస్ జట్టు కూడా ఇదే విధంగా రోస్టన్ చేజ్‌ను ఓపెనర్‌గా పంపింది అని మహమ్మద్ కైఫ్ తెలిపారు. పెద్ద మ్యాచ్ కి ముందు మార్పులు చేయడం కొన్నిసార్లు జట్టుకు ప్రయోజనం కలిగిస్తుందని వెల్లడించాడు. సంజు శాంసన్‌ను జట్టులోకి తీసుకురాగానే అతను అద్భుతంగా ఆడాడు.. ఆ మార్పుతో జట్టుకు లాభం కలిగిందన్నారు. భారత జట్టులో అనుభవజ్ఞులైన ప్లేయర్స్ చాలా మంది ఉన్నారని చెప్పుకొచ్చాడు. రింకూ సింగ్ ఎక్కడ ఆడినా పరుగులు చేసే ఆటగాడు.. టెస్టులు, రంజీ ట్రోఫీ లేదా ఐపీఎల్ అయినా అతడు తన ప్రతిభను నిరూపించుకున్నాడని పేర్కొన్నాడు. ఒక ఆటగాడు ఫామ్‌లో లేకపోతే, బయట మంచి ఫామ్‌లో ఉన్న ప్లేయర్ కి అవకాశం ఇవ్వడం తప్పు కాదని చెప్పాడు. డగౌట్‌లో రింకూ సింగ్ ఉన్నప్పుడు అతనికి ఎందుకు ఛాన్స్ ఇవ్వడం లేదని కైఫ్ ప్రశ్నించాడు. అభిషేక్ శర్మను సంజు శాంసన్‌తో పోల్చడం సరికాదని కైఫ్ అన్నారు. అభిషేక్ ఇంకా ఐసీసీ టోర్నమెంట్‌లలో కొత్త ప్లేయర్, శాంసన్ మాత్రం అనుభవజ్ఞుడైన ఆటగాడని వివరించాడు. అతడు టీ20 క్రికెట్‌లో 8000కుపైగా పరుగులు చేశాడు. ఐపీఎల్‌లో అత్యుత్తమ హిట్టర్లలో ఒకడిగా నిలిచాడు. ఇప్పటికే స్థిరమైన ఆటగాడిగా శాంసన్ గుర్తింపు పొందాడు. కానీ అభిషేక్ శర్మ ఇంకా యంగ్ క్రికెటర్ మాత్రమే.. తన ఆటను మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మరో ఆటగాడు వరుణ్ చక్రవర్తి ప్రదర్శనపై కూడా చర్చ జరుగుతున్నప్పటికీ అతన్ని జట్టు నుంచి తప్పించే అవకాశం తక్కువగా ఉందని మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ తెలిపాడు. వరుణ్ చక్రవర్తి వచ్చే మ్యాచ్‌లో తన బౌలింగ్ లైన్‌ను మార్చి మెరుగ్గా బౌలింగ్ చేసే ఛాన్స్ ఉందన్నాడు.

# టీ20 ప్రపంచ కప్ ఫైనల్స్‌లో టీమిండియా రికార్డులు..







**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ 2026లో ఇంగ్లాండ్‌ను ఓడించి ఫైనల్‌కు చేరిన భారత జట్టు మరోసారి చరిత్ర సృష్టించేందుకు అడుగు దూరంలో నిలిచింది. న్యూజిలాండ్‌తో జరగనున్న ఈ ఫైనల్ పోరుతో టీమిండియా టీ20 ప్రపంచకప్ చరిత్రలో నాలుగోసారి ఫైనల్‌కు చేరిన తొలి జట్టుగా రికార్డుల్లోకి ఎక్కింది. ఇప్పటి వరకు ఇండియన్ టీమ్ మూడు సార్లు ఫైనల్ ఆడగా, అందులో రెండు సార్లు టైటిల్‌ను దక్కించుకుంది. ఈసారి కూడా ట్రోఫీని గెలిచి ప్రపంచ క్రికెట్ లో అధిపత్యం ప్రదర్శించాలని చూస్తుంది.

**2007 టీ20 ప్రపంచకప్ ఫైనల్:**

టీ20 ప్రపంచకప్ ప్రారంభమైన మొదటి టోర్నమెంట్ 2007లోనే భారత్ ఫైనల్‌కు చేరుకుంది. మహేంద్ర సింగ్ ధోనీ నాయకత్వంలోని యువ భారత జట్టు అద్భుత ప్రదర్శనతో పాకిస్థాన్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో ఐదు పరుగుల తేడాతో విజయం సాధించి మొదటిసారి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆ ఫైనల్ మ్యాచ్ లో గౌతమ్ గంభీర్ కీలక పాత్ర పోషించాడు. జోహన్నెస్‌బర్గ్‌లోని వాండరర్స్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో అతడు 54 బంతుల్లో 75 పరుగులు చేసి భారత జట్టు విజయంలో కీ రోల్ పోషించాడు.

**2014 టీ20 ప్రపంచకప్ ఫైనల్:**

టీమిండియా రెండోసారి 2014లో టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌కు చేరింది. బంగ్లాదేశ్‌లోని ధాకాలోని షేర్---ఎ---బంగ్లా నేషనల్ స్టేడియంలో శ్రీలంకతో జరిగిన ఫైనల్‌లో టీమిండియా ఆరు వికెట్ల తేడాతో ఓడిపోయింది. ఆ విజయంతో శ్రీలంక తన తొలి టీ20 ప్రపంచకప్ ట్రోఫీని గెలుచుకుంది.

**2024 టీ20 ప్రపంచకప్ ఫైనల్:**

2024లో భారత్ మూడోసారి ఫైనల్‌కు చేరి దక్షిణాఫ్రికాపై 8 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో టీమిండియా రెండోసారి టీ20 ప్రపంచకప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఆ ఫైనల్ మ్యాచ్ లో విరాట్ కోహ్లీ అద్భుతమై ఇన్నింగ్స్ ఆడాడు. 76 పరుగులు చేసి టీమిండియా జట్టుకు విజయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించాడు. ఆ ప్రదర్శనకు గాను అతనికి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు వరించింది.

**2026లో చరిత్ర సృష్టించే ఛాన్స్:**

2026 టీ20 ప్రపంచకప్‌లో భారత్ మరోసారి ఫైనల్‌కు చేరుకుంది. న్యూజిలాండ్‌తో జరిగే ఈ తుది పోరులో విజయం సాధిస్తే టీమిండియా మరో చరిత్ర సృష్టించే అవకాశం ఉంది. టీ20 ప్రపంచకప్ చరిత్రలో వరుసగా టైటిల్‌ను కాపాడుకున్న తొలి జట్టుగా నిలవనుంది.



**ప్రగ్యా జైస్వాల్ ఎల్లప్పుడూ మంచి సూర్యాస్తమ యాన్ని అభినందిస్తూ ఉంటుంది**

# దళపతి 'జన నాయగన్' కోసం ఆ ముగ్గురు!

కోలీవుడ్ స్టార్ హీరో దళపతి కథనాయకుడిగా నటించిన భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ -జన నాయగన్-. ఈ మూవీని ఏ క్షణాన మొదలు పెట్టారో కానీ అడుగడుగున ఇబ్బందులే తలెత్తుతున్నాయి. ఇంత వరకు ఏ స్టార్ హీరో సినిమాకు రాని ఇబ్బందులు ఈ మూవీకి ఎదురవుతున్న విషయం తెలిసిందే. విజయ్ నటించిన చివరి సినిమా సాఫీగా రిలీజ్ అవుతుందని అభిమానులు, ఇన్నేళ్లు స్టార్ హీరోగా అభిమానుల్ని అలరించిన కథానాయకుడిగా గ్రాండ్‌గా ఫేర్‌వెల్ ఇవ్వాలని మేకర్స్ భారీ స్థాయిలో రిలీజ్ కోసం ప్లాన్ చేసుకోవడం తెలిసిందే.జనవరి 9న పొంగల్ బరిలో భారీగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. అయితే సెన్సార్ బృందం అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సర్టిఫికెట్ ఇవ్వడానికి నిరాకరించడంతో సినిమా రిలీజ్ వాయిదాపడి అంతరిని షాక్‌కు గురి చేసింది. మేకర్స్ షాక్ నుంచి తేరుకుని మద్రాస్ హైకోర్టుని ఆశ్రయించడం, కోర్టు సెన్సార్ వారిని మందలించి సర్టిఫికెట్ జారీ చేయాల్సిందేనని తీర్పు చెప్పడంతో అభిమానులు, మేకర్స్ ఊపిరి పీల్చుకున్నారు. ఇక సినిమా రిలీజ్‌కు ఎలాంటి అడ్డంకులు లేవని సంబరాలు చేసుకున్నారు.



ఇక్కడే డామిట్ కథ అడ్డంతిరిగింది. సీబీఎఫ్‌సీ వర్గాలు మద్రాస్ సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుని సవాల్ చేయడంతో మళ్లీ కథ మొదటికొచ్చి -జన నాయగన్- రిలీజ్ ఆగిపోయింది. ఫైనల్‌గా సినిమా చుట్టూ జరుగుతున్న వివాదాన్ని అర్థం చేసుకున్న మేకర్స్ సెన్సార్ వారికి వ్యతిరేకంగా వేసిన పిటీషన్‌ని రిటర్న్ తీసుకుని వారు అడిగిన కట్స్‌కు అంగీకారం తెలుపుతూ ఫైనల్ కట్‌ని రివైజింగ్ కమిటీకి పంపించి గత కొన్ని రోజులుగా ఎదురు చూస్తున్నారు. ఫైనల్‌గా రివైజింగ్ కమిటీ నుంచి మేకర్స్‌కి మెయిల్ వచ్చేసింది.మార్చి 9న మధ్యాహ్నం 2 గంటలకు సినిమాని రివ్యూ చేస్తామని ప్రకటించారు. దీంతో కేవీఎన్ ప్రొడక్షన్ వర్గాల్లో కొత్త ఉత్సాహం మొదలైంది. రివైజింగ్ కమిటీ సినిమా చూసి సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వబోతోంది. మార్చి 9న కానీ, లేదా రెండు మూడు రోజుల్లో సెన్సార్ సర్టిఫికెట్ జారీ చేస్తే సినిమాని ఇదే నెలలో రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే దళపతి కోసం ముగ్గురు స్టార్ డైరెక్టర్లు రంగంలోకి దిగినట్టుగా తెలుస్తోంది. విజయ్‌తో భారీ సినిమాలని అందించిన లోకేష్ కనగరాజ్, అట్లీ, నెల్సన్ దిలీప్ కుమార్ ఈ మూవీలోని ఓ కీలక ఘట్టంలో అతిథి పాత్రల్లో కనిపించనున్నారని తెలిసింది.

విజయ్ చివరి సినిమా కావడంతో ఈ ముగ్గురు డైరెక్టర్లు ఇందులో అతిథి క్యారెక్టర్లలో కనిపిస్తారని కోలీవుడ్ వర్గాలు అంటున్నాయి. ఇదిలా ఉంటే తెలుగు సూపర్ హిట్ ఫిల్మ్ -భగవంత్ కేసరి- ఆధారంగా ఈ మూవీని రీమేక్ చేసిన విషయం తెలిసిందే. ఇంత వరకు ఆ విషయాన్ని అధికారికంగా అంగీకరించని మేకర్స్ ఫైనల్‌గా ఈ మూవీ డిటైల్స్‌లలో ఇది -భగవంత్ కేసరి- రీమేక్ అని ప్రకటించడం గమనార్హం.



**మృణాల్ ఠాకూర్ సొగసైన బ్లాక్ చీర లుక్‌లో స్టన్స్**

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D.No:10-11G-60/1, Flat No.4, Keelapatla Road Cross, Bangalore ByPass Road,Gangavaram MDL,Palamaneru Chittoor Dist, Editor Gantyada Apparao. PRGI Registration No. " APTEL/25/A4274 " e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965